ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
గురువారం 25 జూలై 2024 | 5





ముంపులోనే : కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో ఇలా..



తగ్గని గోదారి : రాజమహేంద్రవరం పుష్కరఘాట్ వద్ద 55 అడుగుల నీటిమట్టం

రాజమహేంద్రవరం నా సొంతింటితో సమానం

సంతృప్తిగానే వెళుతున్నా : కమిషనర్ దినేష్ కుమార్



రాజమహేంద్రవరంసిటీ, జూలై 24 : రాజమహేంద్రవరం నగరం నా సొంతింటితో సమానం అని కమిషనర్ దినేష్ కుమార్ అన్నారు. గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్‌గా బదిలీ అయిన నేపథ్యంలో రాజమహేంద్రవరంతో ఉన్న అను బంధాన్ని గుర్తుచేసుకున్నారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. గతంలో తెనాలి, నెల్లూరు కమిషనర్లుగా పనిచేసినా రాజమహేంద్రవరంతో ఉన్న అనుబంధం వేరన్నారు.చారిత్రాత్మక నగరానికి కమిషనర్‌గా చేయడం నా అదృ ష్టంగా భావిస్తున్నాని చెప్పారు. తాను బాధ్యతలు చేపట్టినప్పుడు కొంత ఇబ్బందులు ఎదుర్కొన్నప్పటికీ ఆటుపై అధికారుల సమన్వయంతో నగరాన్ని తీర్చిదిద్దాలనే ఆలోచనతో ముందుకు సాగానని చెప్పారు. నగర ప్రజలు కూడా తాము ఏ నిర్ణయం తీసుకున్నా దానిని స్వాగతించడం మర్చిపోలేదన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో టాప్ 20లో ర్యాంక్ సాధించాలని అనుకున్నా.. క్వారీ ప్రాంతం డంపింగ్ యార్డుల్లో చెత్త తరలించడం కుదరక ర్యాంక్ సాధించలేపోయామన్నారు. గతం లో 94 ఉన్న ర్యాంక్‌ను 54కు చేర్చామన్నారు. నగరపాలక సంస్థ ఆదా యాన్ని రూ.55 కోట్ల నుంచి రూ.75 కోట్లకు పెంచామన్నారు. నేను సంతృప్తిగానే రాజమహేంద్రవరం నుంచి వెళుతున్నానన్నారు.

నేడు కమిషనర్‌గా కేతన్ గర్గే బాధ్యతల స్వీకరణ



రాజమహేంద్రవరం సిటీ, జూలై 24 : రాజమహేంద్రవరం కమిషనర్‌గా కేతన్ గర్గే గురువారం బాధ్యతలు స్వీకరించనున్నారు. ఇప్పటివరకు కేతన్ గర్గే అనంతపురం జిల్లా జాయింట్ కలెక్టర్‌గా పనిచేశారు. ఇప్పటి వరకు రాజమహేంద్రవరం కమిషనర్ గా పనిచేసిన దినేష్ కుమార్ గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్‌గా బదిలీ అయ్యారు. రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్ పిఎం సత్యవాణికి బుధవారం రాత్రి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించి దినేష్ కుమార్ రిలీవ్ అయ్యారు. గురువారం ఉదయం 10 గంటలు దాటక కేతన్ గర్గే బాధ్యతలు స్వీకరించనున్నారు.

నిఫా వైరస్‌పై జీజీహెచ్ అప్రమత్తం

నలుగురు వైద్యులతో రాపిడ్ రెస్పాన్స్ టీం ఏర్పాటు

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 24 : కొత్త రకం వైరస్ నిఫాపై రాజమహేంద్రవరం జీజీహెచ్ అధికారులు అప్రమత్తమయ్యారు. ఈ మేరకు నలుగురు అసిస్టెంట్ ప్రొఫెసర్ స్థాయి వైద్యులతో కూడిన రాపిడ్ రెస్పాన్స్ టీంను ఏర్పాటు చేశారు. డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ ఆదేశాల మేరకు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీ సూర్యప్రభ వైద్యుల బృందాన్ని నియమించారు. తక్షణమే చర్యలు చేపట్టాలని ఆదేశాలిచ్చారు. ఈ రాపిడ్ రెస్పాన్స్ టీంలో డాక్టర్ ఎం.కిరణ్ (రెస్పిరేటరీ మెడిసిన్), డాక్టర్ వై.శశాంక నీలం (జనరల్ మెడిసిన్), డాక్టర్ బీవీవీఎస్ మహేంద్ర (అనస్థీషియా), డాక్టర్ ఎం.ఆనంద సత్యతేజ్ (మైక్రోబయాలజీ) ఉంటారు. వైద్యుల బృందం పుణెలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ సూచించిన మార్గదర్శకాలకు అనుగుణంగా అనుమానితులకు సంబంధించిన వివరాలను కేస్ ఇన్వెస్టిగేషన్ ఫార్మ్ (నిఫా వైరస్) ద్వారా పూర్తి సమాచారాన్ని పంపించాల్సి ఉంటుందని సూపరింటెండెంట్ పేర్కొన్నారు.



నిండు గోదారి : రోడ్ కం రైలు బ్రిడ్జి వద్ద గోదావరి ఉధృతి

శాంతించని నది!

గోదారి వరద తగ్గుముఖం

రాజమహేంద్రవరం సిటీ/కొవ్వూరు, జూలై 24 : ముంపు వీడలేదు.. ముప్పు వీడ లేదు.. గోదావరి వరద ఉధృతి తగ్గలేదు..అటు భద్రాచలం - ఇటు ధవళేశ్వరం వద్ద రెండో ప్రమాద హెచ్చరిక కొనసాగుతూనే ఉంది. దీంతో గోదావరి పరీవాహక ప్రాంత ప్రజలు ఇంకా భయం భయంగానే గడుపుతున్నారు. ఎగువన భద్రాచలం వద్ద తగ్గుముఖం పట్టినా ధవళేశ్వరం వద్ద వరద ఉధృతి కొనసాగుతోంది.. ధవళేశ్వరం వద్ద బుధవారం తెల్లవారుజామున 14.90 అడుగుల వరకు పెరిగిన నీటిమట్టం ఆపై 8 గంటల పాటు నిలకడగా కొనసాగింది. మధ్యాహ్నం 12 గంటలకు నెమ్మదిగా తగ్గుముఖం పడుతూ రాత్రి 7 గంటలకు 14.60 అడుగులుగా నమోదైంది. రాత్రి 11 గంటలకు 14.40 అడుగులకు నీటిమట్టం చేరింది. కాటన్ బ్యారేజ్ నుంచి 13,61,297 లక్షల క్యూసెక్కులు సముద్రంలోకి ప్రవహిస్తుంది.ఈ సారి కాటన్‌బ్యారేజ్ నుంచి అత్యధికంగా 14,56,651 క్యూసెక్కులు ప్రవాహం సముద్రంలోకి ప్రవహించింది. ప్రస్తుతం ప్రమాద హెచ్చరికలు కొనసాగుతుండగా నీటిమట్టం తగ్గుముఖం పడుతూ ఉండడ ంతో గురువారం ఉదయానికి రెండో ప్రమాద హెచ్చరిక ఉపసంహరించేస్థాయికి నీటి మట్టం తగ్గుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఎందుకంటే భద్రాచలం నుంచి వరద ధవళేశ్వరం కాటన్ బ్యారేజ్‌కి చేరుకోవడానికి సుమారు 18 గంటలు పడుతుంది. దీంతో అఖండ గోదావరి ఇంకా ఉధృతంగానే పొంగి ప్రవహిస్తుంది. రాజమహేంద్రవరంలోని హేవ్‌లాక్ బ్రిడ్జి, ఆర్చ్ బ్రిడ్జిల మధ్య వరద ప్రవాహం చాలా వేగంగా వెళుతోంది. పుష్కరాలరేవులో గోదావరి వరద 55 అడుగులకు చేరింది.పుష్కరాల రేవు నుంచి ఎగువ కాతేరు వైపు గోదావరి వస్తున్న తీరు భయానకంగా ఉంది. కనుచూపుమేరలో అంతా వరదనీరే కనిపిస్తుంది.కొవ్వూరు గోష్పాదక్షేత్రంలోని ఆలయాలన్నీ రెండో రోజు వరద ముం పులోనే ఉన్నాయి. రాజమహేంద్రవరంలో కోటిలింగాలరేవు, చింతాలమ్మరేవు, పుష్కరాలరేవు, జీవకారుణ్యం రేవు, టీటీడీ ఘాట్, శ్రద్ధానంద ఘాట్, లాంచీల రేవు, పిండాలరేవు,దోబీఘాట్, సరస్వతి ఘాట్, గౌతమి ఘా ట్లు మునిగిపోయాయి.దీంతో ఆయా రేవులను మూసివేశారు.పుష్కరాలరేవులో నిత్య హారతిచ్చే ఘాట్ మొత్తం నీటమునిగింది. అధికారులు ముందస్తు చర్యల్లో భాగంగా ప్రతి ఘాట్‌లో పోలీస్ పహరా ఏర్పాటు చేశారు.గోష్పాదక్షేత్రానికి వెళ్ళే అన్ని రహదారులు బారికేడ్లు ఏర్పాటుచేసి మూసివేశారు.పోలీసు, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది 24 గంటలు మూడు షిఫ్టులుగా పర్యవేక్షిస్తున్నారు.మెడికల్ క్యాంపులు కొనసాగిస్తున్నారు. కొవ్వూరు గోష్పాదక్షేత్రం వద్ద వరదను డీఎంహెచ్‌వో వెంకటేశ్వరరావు పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. వరద బాధిత ప్రాంతాల్లో శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు.



శివపాదాన పుట్టావంట గంగమ్మ.. శ్రీహరి పాదాన పుట్టావంట గంగమ్మ.. రాజమహేంద్రవరం గోదావరి గట్టున ఉన్న నీలకంఠేశ్వరస్వామి ఆలయం వద్ద గోదారమ్మ శివయ్యను తాకివెళుతున్న ఈ దృశ్యం చూపరులను ఆకట్టుకుంటుంది.

- ధవళేశ్వరం వద్ద నిలకడగా గోదారి
- 14.40 అడుగులకు నీటిమట్టం
- 13.61 లక్షల క్యూసెక్కులు దిగువకు
- ఇంకా రెండో ప్రమాద హెచ్చరిక
- నేడు విరమించే అవకాశం
- నీట మునిగిన గోదావరి ఘాట్లు
- బారికేడ్లతో మూసివేత
- నీటి ముంపులోనే లంకలు
- భద్రాచలం వద్ద తగ్గిన వరద

మద్దూరులంకలో ఏటిగట్టు పటిష్టత..

కొవ్వూరు మండలం మద్దూరులంక గ్రామంలో బలహీనంగా ఉన్న ఏటిగట్టును ఇసుక బస్తాలతో మరింతగా పటిష్టపరిచారు. ఫ్లడ్ ప్రత్యేక అధికారి, టూరిజం శాఖ డిప్యూటీ కలెక్టర్ స్వామినాయుడు, కొవ్వూరు తహశీల్దార్ కె.మస్తాన్ పర్యవేక్షించారు. హెడ్ వాటర్ వర్క్సు ఈఈ కాశీవిశ్వేశ్వరరావు, సిబ్బందితో మద్దూరులంక గ్రామాన్ని సందర్శించారు. వరద పరిస్థితిని చూశారు. గ్రామం చుట్టూ ఉన్న ఏటిగట్టును పరిశీలించి పటిష్ట పరచడానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తామన్నారు. వరద ఉధృతి తగ్గకపోవడంతో మద్దూరులంక గ్రామంలో ప్రత్యేక శానిటేషన్, మెడికల్ క్యాంపులు కొనసాగిస్తున్నామని తహశీల్దార్ మస్తాన్ తెలిపారు. వరద మరలా పెరిగితే మద్దూరులంక, పల్లిపాలెం గ్రామాల్లో ముంపు బాధితులను తరలించడానికి మద్దూరు జడ్పీ హైస్కూల్‌లో పునరావాస కేంద్రాన్ని కొనసాగిస్తున్నామన్నారు. రాజమహేంద్రవరంలో కేతావారిలంక, బ్రిడ్జిలంక, తదితర లంకల నుంచి సుమారు 400 మంది మత్స్యకారులను చందాసత్రం, మునిసిపల్ కల్యాణ మండపంలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు తరలించారు. గోదావరి రేవులన్నీ అధికారులు మూసివేయడంతో ప్రజలు ఆయా రేవుల వద్ద ఏర్పాటు చేసిన బారికేడ్లు, కర్రలతో నిర్మించిన అడ్డుకట్టల నుంచే గోదావరిని తిలకిస్తున్నారు. నదీ ప్రవాహం ప్రమాదకర స్థాయిలో ఉండడంతో ప్రజలెవ్వరిని గోదావరి సమీపంలోకి అనుమతించడంలేదు.

ముంచేసిన కొవ్వాడ



తాళ్ళపూడి, జూలై 24 : కొవ్వాడ వరద ముంపు కారణంగా తాళ్ళపూడి మండలంలోని తిరుగుడుమెట్ట, అన్న దేవరపేట, గజ్జరం, ములకలపల్లి తదితర గ్రామాల్లో వరి పొలాలు చెరువులను తలపిస్తున్నాయి. పంట పొలాల్లో నీరు బయటకు రాక రైతాంగం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.తాళ్ళపూడి మండలంలో 1448 ఎకరాల్లో వరి పొలాలు నీట మునిగినట్టు ఏవో రుచిత తెలిపారు.

పెరవలిలో వర్రీయే..



పెరవలి, జూలై 24 : ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలతో కానూ రు, నడిపల్లి,ఉసులుమర్రు, కానూరు అగ్రహారం గ్రామాల పరిధిలో పొలాలు ముంపునకు గురయ్యాయి.సరైన డ్రెయినేజీ వ్యవస్థ లేక నీరు నిలిచి పంటలు పాడయ్యే పరిస్థితికి చేరుకున్నాయి. మంత్రి దుర్గేష్, కలెక్టర్ ప్రశాంతి ఆదేశాల మేరకు కానూరులో మురుగు డ్రెయిన్ తవ్వకం పనులు జరుగుతున్నాయి.ఉసులుమర్రు ప్రాంతంలో మాత్రం సుమా రు 1000 ఎకరాలు భూములు ఇంకా ముంపులోనే ఉన్నాయి.



చెరువా.. రోడ్డా : ఇటీవల కురిసిన వర్షానికి కంబాలచెరువు హైటెక్ బస్టాండ్ వద్ద చెరువులా మారిన రోడ్డు

ఛీ..జన్!

వైసీపీ నిర్లక్ష్యం..జనానికి నరకం

- ఐదేళ్లుగా సిల్ట్‌తో నిండిన డ్రెయినేజీలు
- చినుకు పడితే చెరువులుగా రోడ్లు
- కనీస చర్యలు చేపట్టని గత పాలకులు
- ప్రస్తుతం జనానికి ప్రత్యక్ష నరకం
- వరదొస్తే రూరల్.. వానొస్తే నగరం
- ముంపుతో తీవ్ర సతమతం
- చెరువులు మూసేయడంతో చిక్కు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

వైసీపీ నిర్వాకం..జనాలకు నరకం చూపిస్తుంది.. ఐదేళ్ల పాలనలో ముంపు సమస్యను గాలికొదిలేయడంతో నేడు వాన పడితే వణుకు మొదలైపోతోంది. ప్రధానంగా రాజమహేంద్రవరాన్ని డ్రైనేజీ సమస్య పట్టిపీడిస్తోంది. వైసీపీ నేతలు తమ ప్రాపకం కోసం ఇష్టానుసారం మౌఖిక ఆదేశాలివ్వడం..వాటికి మునిసిపల్ అధికారులు తలూపడం కారణంగా డ్రెయినేజీల్లో పారాల్సిన నీరు రోడ్లను ముంచేస్తోంది. 'నీళ్లు పల్లమెరుగు' అని చదువు లేని వాళ్లకు కూడా తెలుసు. కానీ నగరపాలక సంస్థ పరిధిలో జరిగిన డ్రైన్లు, డివైడర్ల నిర్మాణాలు చూసి ఇంజనీరింగ్ చదువులు నవ్విపోతుండడంపై 'ఆంధ్రజ్యోతి' కథనం.

చినుకు పడిందా..రోడ్లు చెరువులే..

రాజమహేంద్రవరాన్ని ముంపు నీటి సమస్య పీడిస్తూనే ఉంది. వర్షాకాలం వస్తే తుమ్మలోవ, ఆనంద్‌నగర్, ఇన్నీసుపేట, ఆర్యాపురం, సావిత్రినగర్, రామకృష్ణానగర్ తదితర ప్రాంతాలు జలమయవుతున్నాయి. రైల్వే స్టేషను, క్వారీ మార్కెట్ తదితర రోడ్లపైకి ముంపు నీరు వచ్చి చేరుతోంది. డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో ఆ నీరు ఎటు వెళ్లాలో తెలియక నిలిచిపోతోంది. వర్షం కురిస్తే కంబాల చెరువు హైటెక్ బస్టాండ్ వద్ద బురదను శుభ్రం చేయడం నగరపాలక సంస్థ పారిశుధ్య విభాగానికి పెద్ద తలనొప్పిగా మారింది. ఎక్కడైనా అభివృద్ధి చేస్తే పరిస్థితి కాస్త మెరుగుపడుతుంది. రాజమహేంద్రవరంలో మాత్రం దిగజారింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎంపీగా ఉన్న వ్యక్తి ఆర్భాటాల కోసం చేసిన పనుల చేటు ఇప్పుడు కనిపిస్తోంది.ఇష్టానుసారం డ్రైన్లు, డివైడర్లు నిర్మించేశారు. ఇంజనీరింగ్, పారిశుధ్య అధికారులను నోరు విప్పనీయలేదు.దీంతో డ్రైనేజీల నిర్మాణంలో శాస్త్రీయత కొరవడింది. బిల్లుల రూపంలో కోట్లాది రూపాయలు మాత్రం వైసీపీ నేతల జేబుల్లోకి వెళ్లిపోయాయి. నిర్మాణాల్లో నాణ్యత కొరవడడంతో మూణ్నాళ్ల ముచ్చటను తలపిస్తున్నాయి. వైసీపీ నేతల నిర్వాకానికి లాలా చెరువు నుంచి వై.జం క్షను వరకూ నిర్మించిన డ్రైను ఒక గొప్ప ఉదాహరణ. డ్రైనులో పూడిక తీయడానికి ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ నుంచి మొదలుకొని ఎక్కడా మ్యాన్‌హోల్స్ లేవు.మొత్తం ఆ చివర నుంచి ఈ చివర వరకూ పూర్తిగా మూసేశారు. పైగా ఫుట్‌పాత్ అంటూ బిళ్లలు అతికించారు. దీంతో డ్రైనులో వ్యర్థాలు పేరుకుపోయి ముంపు నీళ్లు రోడ్లపైకి వస్తోంది. ఒక్కసారి ఆర్ట్స్ కళాశాల వద్ద మురుగు నీరు పొంగి విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. మేనకాబార్, క్వారీ మార్కెట్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ముంపు నీరు ముంచేస్తోంది. జాంపేట మార్కెట్ ప్రాంతంలో అడ్డ వీధుల్లో నిర్మించిన డ్రైన్ల అవుట్‌లెట్ మెయిన్ డ్రైన్ కిందకు చేరుతుంది. దీంతో ఆ వీధులు జల మయం అవుతున్నాయి. దీనికితోడు కంబాల చెరువు నుం చి క్వారీ మార్కెట్‌కి వెళ్లే రోడ్డులో డివైడర్లు నిర్మించారు. అప్పటి వరకూ అవతల వైపున ఎత్తు నుంచి ఇటువైపు పల్లపు డ్రైనులోకి ముంపు నీరు ప్రవహించేది.కానీ డివైడరు కట్టినప్పుడు చిన్నపాటి గొట్టాలు మాత్రమే అమ ర్చడంతో అది వ్యర్థాలతో మూసుకుపోయి డ్రైనులో నీళ్లు రోడ్డుపైకి చేరుతున్నాయి.దేవీచౌక్ తదితర ప్రాంతాల్లోనూ ఇదే దుస్థితి ఉంది. ధవళేశ్వరంలోక్వారీ కాల్వను శుభ్రం చేయించకపోవడంతో అక్కడా నీటిముంపు తప్పడంలేదు.



సావిత్రినగర్‌లో నీట మునిగిన రోడ్డు

కంబాల చెరువు..గుండె బరువు..

వైసీపీ అధికారంలోకి రాక మునుపు కంబాల చెరువు చాలా మటుకు ముంపు నీటికి సమాధానంగా ఉండేది. కానీ వైసీపీ హయాంలో మాజీ ఎంపీ ఈ చెరువుకు ఏకంగా రూ.13 కోట్ల ప్రజాధనాన్ని ధారపోసి సోకు చేశారు.ఆ డబ్బుతో కంబాల చెరువును కంపు చెరువుగా మార్చేశారు. చారిత్రక నేపథ్యం ఉన్న ఈ చెరువు ఇప్పుడు దేనికీ ఉపయోగం లేకుండా మారిపోయింది.నాగుల చెరువులో స్టేడియం కట్టేస్తామని ఆయనే చెప్పారు. ఈ క్రమంలో చెరువులకు అనుసంధానం కూడా తెగిపోయింది. ముంపునీటికి ఎటు పారాలో తెలియక ఇళ్లను ముంచెత్తుతోంది.ఆర్భాటాలకు డబ్బును ధారాళంగా ఖర్చు చేసిన వైసీపీ నేతలు శివారుల్లో డ్రైన్లు నిర్మించడమే మరిచారు.

పరిష్కారమిదేనా..

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ పరిధిలో 60 కిలోమీటర్లకుపైగా మీడియం, 8 కిలోమీటర్ల వరకూ మేజర్ డ్రైన్లు ఉన్నాయి. వీటి అవుట్‌లెట్లు.. జంక్షన్ పాయింట్లు సరిగా లేవు. రెండు కంటే ఎక్కువ డ్రైన్లు కలిసే జంక్షను పాయింట్లు చోకింగ్ పాయింట్లుగా మారుతున్నాయి. ప్రస్తుతం ముంపు నీటిని పంపింగ్ చేయడం ద్వారా క్లియర్ చేస్తున్నారు. తిలక్ రోడ్ తదితర ప్రాంతాల నుంచి సత్యనారాయణపురం మీదుగా మురుగు,ముంపునీరు మురుగు నీటి శుద్ధి కేంద్రానికి చేరుతోంది. ఇటు క్వారీ ఏరియా, విద్యానగర్, భాస్కర్‌నగర్, ఆల్ బ్యాంకు కాలనీ తదితర మెరక ప్రాంతాల నుంచి పల్లపు ప్రాంతాలకు వస్తున్న నీటిని ఎత్తిపోయడం తప్ప వేరే మార్గం లేదు. ప్రస్తుతానికి కోటిలింగాల పేట, బాలికల ఉన్నత పాఠశాల పక్కన,రాజీవ్ పాకల ప్రాంతంలో పంపింగ్ స్టేషన్లు ఉన్నాయి. క్వారీ మార్కెట్, కంబాల చెరువు తదితర ప్రాంతాల మురుగు, ముంపు నీరు నల్లాచానెల్‌కి వెళుతోంది. 45, 46 వార్డుల్లో గాదిరెడ్డి నగర్, కళాకారుల కాలనీ, ఆనంద్ నగర్‌లో ముంపునీటిని ఎత్తిపోసి మెయిన్ డ్రైనులోకి మళ్లిస్తున్నారు. అయితే మరిన్ని డైవర్షన్లు అవసరంగా కనిపిస్తోంది. ఉదాహరణకు క్వారీ ఏరియా నుంచి అటు కాతేరు చెరువుకు పంపింగ్ చేయాలి.రైల్వే స్టేషను గోడను ఆనుకొని మూడడుగుల డ్రైను ఉంది. దాని నిర్మాణంలో వాలు అనే ప్రాథమిక సూత్రం పాటించకపోవడంతో నీరు పారక పూడుకుపోయింది. దీంతో చర్చి దగ్గర నుంచి రిలయన్స్ మార్టు వరకూ ఉన్న డొప్ప వంటి ప్రాంతంలో ముంపు నీరు భారీగా నిలిచిపోతోంది. ఇక్కడ కూడా పరిష్కారం చూపాల్సిన అవసరం ఉంది.



గోదావరి వరద పోటెత్తడంతో రాజమహేంద్రవరం డి మార్టు వద్ద రోడ్డు ఎత్తుకు చేరిన ఆవ కాల్వ నీరు

వరదొస్తే.. ఇంతే..



రామకృష్ణనగర్‌లో ఇలా..

రాజమహేంద్రవరం రూరల్,జూలై 24 : గోదావరి వరద కారణంగా ధవళేశ్వరం సాయి బాబా ఆలయం ప్రాం తంలో ఉన్న ఆవ కాలువను అధికారులు మూసివేశారు. అయినా నీరు ఎగదన్నుతోంది.రాజమహేంద్రవరం అర్బన్, రూరల్ ప్రాంతాల నుంచి వచ్చే వర్షపునీరు, మురుగునీరు గోదావరిలోకి వెళ్లే పరిస్థితి లేకపోవడంతో నీరు వెనక్కి ఎగదన్నుతుంది. రూరల్‌లోని హుక్కుంపేట గ్రామం పరిధిలోని రామకృష్ణనగర్, సావిత్రినగర్, బొమ్మూరు రోడ్డు, బాలాజీ పేట తదితర ప్రాంతాల్లో రోడ్డు పైకి నీరు చేరింది. దీంతో ఆయా ప్రాంతాలు దుర్వాసన వెదజల్లుతున్నాయి. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి ఏటా గోదావరి వరదల సమయంలో ఈ ప్రాంతాలు జలమయం అవుతున్నా శాశ్వత పరిష్కారం లభించడంలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కాటన్ దొరకు ఘన నివాళి



ధవళేశ్వరం, జూలై24: కాటన్ దొర 125వ వర్ధంతిని పురస్కరించుకుని బుధవారం బ్యారేజ్ కూడలిలోని కాటన్ దొర విగ్రహానికి గోదావరి కల్చరల్ అసోసియేషన్ సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.గోదావరిపై ఆనకట్ట నిర్మించి లక్షలాది ఎకరాలకు సాగునీరందించిన గొప్ప వ్యక్తి కాటన్‌దొర అని కొనియాడారు. నీటి పారుదల శాఖ సర్కిల్ కార్యాలయం సమీపంలో గల కాటన్ స్మృతి వనంలోని కాటన్ విగ్రహానికి డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు పూలమాల వేసి నివాళులర్పించారు.కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు రాకా రమణ, కార్యదక్షుడు యర్రమోతు ధర్మరాజు, పీఎస్ శేషకుమార్, కేఎస్ గౌరీ శంకర్, ఎం. రమేష్, శ్రీరంగం శ్రీనివాసరావు, మద్దాల అను, ముత్యాల పోసికుమార్, బోడపాటి కుమార్, పందెళ్ళ భాను ప్రసాద్ పాల్గొన్నారు.



ఆవ భూములు పరిశీలించిన కలెక్టర్

కోరుకొండ, జూలై24: ఆవ భూములు, ఇళ్ళస్థలాలు ముంపుకు గురవకుండా చూసేందుకు పరిశీలన చేసి సమగ్ర సమాచారం సేకరించి అధికారులు నివేదిక అందజేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. కోరుకొండ మండలం బూరుగుపూడి గ్రామంలో బుధవారం ఆవభూముల్లో ఇళ్ళ పట్టాలు ఇచ్చిన స్థలాలను పరిశీలించి మాట్లాడారు. గత ప్రభుత్వం ఆవ ప్రాంతం కాపవరం, బూరుగుపూడి గ్రామాల్లో 361 ఎకరాల్లో భూములను ఇళ్లస్థలాల లబ్ధిదారులకు పట్టాలు జారీ చేశారని తెలిపారు.ఇటీవల తూర్పుగోదావరి జిల్లాలో నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధుల పరిచయ కార్యక్రమం సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు ఆవభూములు ఇళ్ళ నిర్మాణానికి పనికిరావని,ముంపుకు గురయ్యేఅవకాశం ఉందని కలెక్టర్ క్షేత్ర స్థాయి పరిశీలన చేయాలని కోరారు.ఈ నేపథ్యంలో కలెక్టర్ బుధవారం పరిశీలించారు. ఆమె వెంట ఆర్డీవో ఎ.చైత్ర వర్షిణి, ఇరిగేషన్ డీఈ కె.ఆనంద్‌బాబు, కోరుకొండ తహశీల్దార్ సుమలత, ఇతర అధికారులు ఉన్నారు.

కాచి చల్లార్చిన నీటిని అందించాలి : డీఈవో

నల్లజర్ల,జూలై 24 : ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు కాచి చల్లార్చిన నీటిని అందించాలని డీఈవో వాసుదేవరావు ఉపాధ్యాయులను ఆదేశించారు. ప్రకాశరావుపాలెం హైస్కూల్‌ను బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలని,విద్యార్థులు నోట్స్ రాసే విధంగా ప్రతి సబ్జెక్ట్ టీచర్ బాధ్యత వహించాలన్నారు. వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు.హెచ్‌ఎం బాధ్యతగా ప్రతి క్లాస్ చెక్ చేసి ఉపాధ్యాయులు బోధించే పాఠాలు విద్యార్థులు అర్థం చేసుకుంటున్నారా లేదా అనేది పర్యవేక్షించాలన్నారు.


వరద ముంపులో వీఆర్ పురం మండలం శ్రీరామగిరి

కాకి లెక్కలు

- పోలవరం ముంపు లెక్కలను చెరిపేసిన గోదావరి వరద
- 41.15 మీటర్ల స్థాయిలో రెండు విలీన మండలాల్లో 19 ఆవాసాలకే ముంపు
- నాలుగు విలీన మండలాల్లో 100కు పైగా ఆవాసాలపై వరద ప్రభావం

(రంపచోడవరం)

పోలవరం ప్రాజెక్టు కింద అల్లూరి జిల్లాకు సంబంధించి ప్రభుత్వం వద్ద ఉన్న ముంపు లెక్కలన్నీ గోదావరి వరదలతో కాకి లెక్కలుగా తేలిపోతున్నాయి. పోలవరం తొలి దశ +41.15 మీటర్లకు మించిన కాంటూరు స్థాయిలో ప్రభావితమయ్యే ఆవాసాలన్నీ వరద ప్రభావితమయ్యాయి. పోలవరం ప్రాజెక్టు 45.72 మీటర్ల దశలో సంపూర్ణతకు సమయం పట్టే పరిస్థితుల్లో తొలి దశగా 41.15 మీటర్ల స్థాయిలో నీటిని నిల్వ చేసేందుకు గత ప్రభుత్వం వేసిన ముంపు లెక్కలు తప్పుతున్నాయి. ప్రాజెక్టు మొదటి దశ స్థాయికి అంచనా వేసిన ముంపు కంటే ముంపు తీవ్రత ఎక్కువగా ఉంటుందని గత రెండు గోదావరి వరదలతో పాటు తాజాగా వచ్చిన వరదలు మరోమారు స్పష్టం చేశాయి. తొలి దశలో దేవీపట్నం మండలంలోని 44 ఆవాసాలతో పాటు రెండు విలీన మండలాల్లో 21 ఆవాసాలు మాత్రమే ముంపునకు గురవుతాయని అధికార లెక్కలు చెప్తుంటే తాజా వరదలు నాలుగు విలీన మండలాల్లో +46 మీటర్ల కాంటూరు స్థాయిలో ఉన్న ఆవాసాలన్నిటిపైనా ప్రభావం చూపాయి. ఈ విధంగా అవి 100కు పైగా ఆవాసాలను ప్రభావితం చేశాయి. ఈ ప్రకారం చూస్తే పోలవరం ముంపు ప్రభావిత అంచనాలకు ఐదు రెట్లకు మించిన ముంపు ఈ వరదల్లో కానవస్తోంది. పోలవరం గత అధికారుల అంచనా లెక్కలు నిజమా లేక ముంచెత్తిన వరద లెక్కలు నిజమా అన్నది చర్చనీయాంశమైంది.

నిజానికి పోలవరం ప్రాజెక్టు కింది 45.72 మీటర్ల స్థాయిలో నీటిని నిల్వ చేయాలన్నది లక్ష్యం. కాగా ఆచరణలో ఇప్పటికి ఇది సాధ్యం కాదని గుర్తించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 41.15 మీటర్ల స్థాయిలో మొదటి దశతోనే నీటిని నిల్వ చేసి ప్రాజెక్టును వినియోగంలోకి తేవాలని నిశ్చయించాయి. తొలి దశలో ముంపు తీవ్రత అల్లూరి జిల్లా దేవీపట్నం, వీఆర్ పురం, కూనవరం మండలాల్లోని 63 ఆవాసాల్లో 5,618 మంది నిర్వాసిత కుటుంబాలపై ప్రభావం చూపాలి. అయితే గోదావరికి వచ్చిన వరదలను పరిశీలిస్తే పోలవరం ముంపు అంచనాలు తప్పవుతున్నాయి. తాజాగా వచ్చిన గోదావరి వరదలు పోలవరం ప్రాజెక్టు కాఫర్ డ్యామ్ వద్ద 34 మీటర్లను దాటి వరద ప్రవహించలేదు. కానీ వరదకు మునిగిపోయిన గ్రామాల లెక్కలు మాత్రం పోలవరం ప్రాజెక్టు తొలి దశ (+41.15 మీటర్ల)కు మించే ఉన్నాయి.

మొదటి దశలో దేవీపట్నం మండలంలోని 44 ఆవాసాలు మునిగిపోతాయి. ఇందులో తాజా వరదల లెక్కలతో పోల్చినా ఎటువంటి వివాదం లేదు. కానీ విలీన మండలాల విషయానికొస్తే తొలి దశలో కేవలం వీఆర్ పురం మండలంలోని 18 ఆవాసాల్లో 2128 నిర్వాసిత కుటుంబాలు, కూనవరం మండలంలోని ఒక గ్రామంలో 216 నిర్వాసిత కుటుంబాలు మాత్రమే ప్రభావితం కావాలి. కానీ ఇప్పుడు ఎదురైన గోదావరి నాలుగు విలీన మండలాల్లోని 100కు పైగా ఆవాసాల్లో 10వేల నిర్వాసిత కుటుంబాలను ప్రభావితం చేశాయి. ఈ పోలవరం లెక్కలను, వరద లెక్కలను పరికించి చూస్తే వాస్తవ విరుద్ధంగా పోలవరం ముంపు లెక్కలు ఉన్నాయన్నది గోదావరి సాక్షిగా తేటతెల్లమవుతోంది. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఈ విలీన మండలాల నిర్వాసితులు వరదలు వచ్చిన ప్రతిసారీ తమకు పరిహారాలను చెల్లించేసి, పునరావాసాన్ని కల్పిస్తే గ్రామాలు ఖాళీ చేసేస్తామని ఎక్కడికక్కడ అధికారులను నిలదీసేవారు. కానీ వారికి ఎక్కడా న్యాయం జరగలేదు. దీంతో ఇటీవల జరిగిన ఎన్నికల్లో వైసీపీకి ఇక్కడి ప్రజలు సరైన గుణపాఠమే చెప్పారు. కూటమి ప్రభుత్వ పాలనలోనైనా తమకు న్యాయం జరుగుతుందని ఆశాభావంతో ఉన్నారు.


స్వీట్లతో అమ్మవారికి పూజ చేస్తున్న అర్చకుడు

పార్వతి అమ్మవారికి సారె మహోత్సవం

150 రకాల స్వీట్లు సమర్పించిన భక్తులు

బిక్కవోలు, జూలై 24: తూర్పు గోదావరి జిల్లా బిక్కవోలు గ్రామంలోని ప్రాచీన గోలింగేశ్వరస్వామి ఆలయంలో వున్న పార్వతి అమ్మవారికి సంకటహర చతుర్థి సందర్భంగా బుధవారం సారె మహోత్సవం నిర్వహించారు. ఆలయ అర్చకులు కొడమంచిలి సత్యనారాయణశర్మ, రఘు ఆధ్వర్యంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. గ్రామోత్సవంలో భక్తులు తీసుకువచ్చిన సారెతో పాటు గ్రామానికి చెందిన చిన్నారుల కోలాటం ఆకట్టుకుంది. పూలు, పండ్లు, పసుపు, కుంకుమ, గాజులతో పాటు 150 రకాల స్వీట్లు అమ్మవారికి సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సారెను భక్తులకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో ఆకెళ్ల భాస్కర్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.


శిక్షణార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న ప్రిన్సిపాల్ వేణుగోపాల్

బాలల వికాస గ్రామాలు నెలకొల్పాలి

సామర్లకోట విస్తరణ శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ వేణుగోపాల్

సామర్లకోట, జూలై 24: జిల్లాల్లో బాలల వికాస గ్రామాలను నెలకొల్పేందుకు కృషి చేయాలని సామర్లకోట విస్తరణ శిక్షణా కేంద్రం ప్రిన్సిపాల్ జె.వేణుగోపాల్ కోరారు. సామర్లకోట విస్తరణ శిక్షణా కేంద్రం అవరణలో 11 జిల్లాలకు చెందిన రెండో బ్యాచ్ డీఎల్ఎంటీలకు మూడు రోజుల శిక్షణ తరగతులను బుధవారం ప్రారంభించారు. వైస్ ప్రిన్సిపాల్ కృష్ణమోహన్ ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణకు ముఖ్య అతిథిగా హాజరైన ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఆరోగ్య, విద్యా రంగాలను సుస్థిరాభివృద్ధి సాధనలోని బాలల వికాస గ్రామం కోసం వనరులను ఎలా వినియోగించుకోవాలో వివరించారు. 11 జిల్లాలకు చెందిన మెడికల్, ఐసీడీఎస్, పంచాయతీరాజ్ శాఖల డీఎల్ఎంటీలు హాజరయ్యారు. ఫ్యాకల్టీలు శ్రీదేవి, శ్రీనివాసరావు, నీహారిక, ప్రసాద్, వెంకటేశ్వర్లు, పద్మజ, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.


ధవళేశ్వరం బ్యారేజీ ఎగువున, దిగువున వరద ప్రవాహం

తగ్గుముఖం

- ధవళేశ్వరం వద్ద అత్యధికంగా 14.90 అడుగులకు పెరిగిన నీటిమట్టం
- 14,56,651 క్యూసెక్కులు సముద్రంలోకి

ధవళేశ్వరం, జూలై 24: గత ఐదు రోజులుగా పెరుగుతూ ప్రవహించిన గోదావరి తగ్గుముఖం పట్టింది. ఎగువ ప్రాంతాల్లో నీటిమట్టం ఇప్పటికే తగ్గింది. ఇంద్రావతి పరివాహకంలో కురిసిన వర్షాల వల్ల పేరూరు వద్ద గోదావరి నీటిమట్టం మరలా పెరుగుతోంది. ధవళేశ్వరం వద్ద బుధవారం తెల్లవారుజామున 14.90 అడుగుల వరకు పెరిగిన నీటిమట్టం ఆపై 8 గంటల పాటు నిలకడగా కొనసాగింది. మధ్యాహ్నం 12 గంటలకు నెమ్మదించి రాత్రి 7 గంటలకు 14.60 అడుగులుగా నమోదయ్యింది. ఈ సమయంలో కాటన్ బ్యారేజీ నుంచి 14.04 లక్షల క్యూసెక్కులను సముద్రంలోకి వదిలారు. అత్యధికంగా 14,56,651 క్యూసెక్కులు ప్రవాహం సముద్రంలోకి ప్రవహించింది. ప్రస్తుతం ప్రమాద హెచ్చరికలు కొనసాగుతున్నాయి. నీటిమట్టం తగ్గుముఖం పడుతుండడంతో గురువారం ఉదయానికి రెండో ప్రమాద హెచ్చరిక ఉపసంహరించే స్థాయికి నీటి మట్టం తగ్గుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. కాగా ఎగువున భద్రాచలం వద్ద క్రమేపీ తగ్గుతున్న నీటిమట్టం బుధవారం సాయంత్రానికి 45.20 అడుగులుగా నమోదైంది. రెండో ప్రమాద హెచ్చరికను ఉపసంహరించారు. ఇంద్రావతి పరివాహకంలో కురిసిన వర్షాల వల్ల పేరూరు వద్ద గోదావరి నీటి మట్టం పెరుగుతుండగా... దాని ప్రభావంతో భద్రాచలం వద్ద మరలా రెండో ప్రమాద హెచ్చరిక స్థాయికి నీటిమట్టం పెరగవచ్చని అంచనా.

బుధవారం సాయంత్రానికి కాళేశ్వరం వద్ద నీటిమట్టం 11.45 మీటర్లు నమోదు కాగా తగ్గుముఖం పట్టింది. పేరూరు వద్ద 16.38 మీటర్లు నమోదు కాగా పెరుగుతోంది. దుమ్ముగూడెం వద్ద 12.03 మీటర్లు, భద్రాచలం వద్ద 45.20 అడుగులు, కూనవరం వద్ద 20.62 మీటర్లు, కుంట వద్ద 12.10 మీటర్లు, పోలవరం వద్ద 13.32 మీటర్లు, రాజమహేంద్రవరం రైల్వే బ్రిడ్జి వద్ద 16.92 మీటర్లుగా నీటిమట్టాలు నమోదయ్యాయి.

శాంతించిన శబరి

- చింతూరు వద్ద 39 అడుగులకు శబరి నీటిమట్టం
- డొంకరాయి జలాశయంలో ప్రమాద స్థాయిలో నీటిమట్టం
- ఏ క్షణంలోనైనా నీటిని విడుదల చేస్తామంటున్న జెన్‌కో అధికారులు

చింతూరు, జూలై 24: శబరి ఉధృతి కాసింత ఊరటనిచ్చింది. మంగళవారం రాత్రి 41.6 అడుగులు ఉన్న నీటిమట్టం బుధవారం రాత్రికి మరింత తగ్గి 39 అడుగులకు చేరుకుంది. భద్రాచలం వద్ద గోదావరి బుధవారం సాయంత్రానికి 45.2 అడుగులకు చేరుకోగా గురువారం ఉదయానికి తిరిగి 48 అడుగులకు చేరుకోవచ్చని సీడబ్ల్యూసీ అధికారులు అంచనా వేస్తున్నారు. ఎగువున కుండపోతగా వర్షం కురుస్తుండడమే ఇందుకు కారణమని చెప్తున్నారు. ముంపు కారణంగా చింతూరు డివిజన్ పరిధిలోని 82 ఆవాసాలకు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. వరద కారణంగా పలు ప్రదేశాల్లో విద్యుత్ స్తంభాలు నేలకొరగడంతో పాటు తీగలపై చెత్త పేరుకపోవడంతో విద్యుత్ శాఖ అధికారులు పునరుద్ధరణ చర్యలు చేపట్టారు. చింతూరు డివిజన్లో ఇప్పటివరకు 11 ఆవాసాలు పూర్తిగా నీటి మునిగాయి. 54 గ్రామాలకు చెందిన రహదారులు జలదిగ్బంధంలో వున్నాయి. ముందు జాగ్రత్తగా లోతట్టు ప్రాంతాలకు చెందిన 960 కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. పలు బాధిత కుటుంబాలు అడవులు, గుట్టల్లో పాకలు వేసుకున్నాయి.

మోతుగూడెం: డొంకరాయి జలాశయంలో నీటిమట్టం ప్రమాద స్థాయికి చేరువలో ఉంది. ఈ జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 1037 అడుగులు. ఈ ప్రాంతంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు బుధవారం నాటికి నీటిమట్టం 1035.20 అడుగులకు పెరిగింది. దీంతో జెన్‌కో అధికారులు



అప్రమత్తమయ్యారు. ప్రస్తుతం వర్షం తగ్గుముఖం పట్టినప్పటికీ వాగుల నుంచి జలాశయంలోకి ప్రస్తుతం 8వేల వరకు ఇన్‌ఫ్లోస్ వస్తున్నట్టు అంచనా వేస్తున్నారు. బుధవారం రాత్రి 10 గంటల వరకు ఇన్‌ఫ్లో ఇలాగే కొనసాగితే ప్రమాద స్థాయికి చేరుకునే అవకాశం ఉంది. నీటిమట్టం 1036 అడుగులకు పెరిగితే వెంటనే దిగువకు నీటిని విడుదల చెయ్యడానికి అధికారులు సమాయత్తమయ్యారు. దిగువ ప్రాంతాల ప్రజలకు ముందస్తు సమాచారం ఇచ్చి అప్రమత్తం చేశారు. డొంకరాయి, పొల్లూరు జల విద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తి కోసం 2300 క్యూసెక్కుల నీటిని పవర్ కెనాల్‌లోకి విడుదల చేస్తున్నట్టు జెన్‌కో అధికారులు చెప్పారు.


చింతూరు డివిజన్‌లో వరద బాధితులతో మాట్లాడుతున్న అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

వరద ముంపులో కలెక్టర్ పర్యటన... బాధితులతో మమేకం

చింతూరు: అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ బృందం బుధవారం చింతూరు డివిజనులోని వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించింది. అధికారులు నాటు పడవలు, ట్రాక్టర్లు, లాంచీలు, కాలినడకన ప్రయాణం చేసి వలస గుడిసెల వద్దకు చేరుకున్నారు. బాధితులతో మమేకమై సదుపాయాల కల్పనపై ఆరా తీశారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం తరపున బియ్యం, కందిపప్పు, పామాయిలు, కిరోసిన్, కూరగాయలు సరఫరా చేశారు. వరరామచంద్రపురం మండలం కల్లనూరుకు చెందిన బాలింత లక్ష్మిని చింతూరు ఐటీడీఏ పీవో కాపూరి చైతన్య తన వాహనంలో చింతూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు.



వరదలోనే విధులు

ఎటపాక, జూలై 24: గోదావరి వరదలకు 11కేవీ విద్యుత్ వైర్లపై చెట్ల కొమ్మలు, ఎండిన పుల్లలు, చెత్త చిక్కుకున్నాయి. విద్యుత్ శాఖ సిబ్బంది బుధవారం వరద ప్రవాహంలోనే నాటు పడవలపై వెళ్లి వాటిని తొలగించారని జేఈ గెల్లంకి రాజ్‌కపూర్ చెప్పారు. వీరాయిగూడెం గ్రామ శివారుతో పాటు రాయనపేట-గుండాల మధ్యలో వాగు ప్రాంతంలోని లైన్లు, నందిగామ గ్రామ శివారులోని స్తంభాలపై చిక్కుకున్న చెత్తను, ఎండిన పుల్లలను లైన్‌మన్ దేవేందర్ నాయక్, జేఎల్ఎం వీరబాబు తొలగించారు. అప్పటివరకు ఈ గ్రామాలకు వేరే ఫీడర్ల ద్వారా విద్యుత్ సరఫరా చేశారు. విద్యుత్ సిబ్బందిని పలువురు ప్రశంసించారు.

నందిగామ వద్ద విద్యుత్ స్తంభంపై చెత్తను తొలగిస్తున్న సిబ్బంది


గ్యాస్ కంపెనీ యజమాని నుంచి వివరాలు సేకరిస్తున్న సీఐ, ఎస్ఐ

హెచ్‌పీ గ్యాస్ కంపెనీ కార్యాలయంలో భారీ చోరీ

షట్టరు తాళాలు పగులగొట్టి రూ.1.50 లక్షల నగదు. 2 సెల్‌ఫోన్ల చోరీ

అనపర్తి, జూలై 24: తూర్పు గోదావరి జిల్లా అనపర్తి కెనాల్ రోడ్డులోని హెచ్‌పీ గ్యాస్ కంపెనీలో భారీ చోరీ జరిగింది. అనపర్తి ఎస్ఐ రామారావు తెలిపిన వివరాల ప్రకారం.... మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు కార్యాలయ షట్టరు తాళాలను పగులగొట్టి లోపలికి ప్రవేశించారు. రూ.1.50 లక్షల నగదుతో పాటు కంపెనీకి చెందిన రెండు సెల్‌పోన్లతో ఉడాయించారు. విషయం తెలుసుకున్న యజమాని కర్రి సాంబశివరెడ్డి పోలీసులను ఆశ్రయించడంతో సీఐ శివగణేష్, ఎస్ఐ రామారావు సంఘటనాస్థలాన్ని పరిశీలించి యజమాని నుంచి వివరాలు సేకరించారు. క్లూస్ టీమ్ వేలిముద్రలు సేకరిస్తోందని, సీసీ ఫుటేజ్ ఆధారంగా నిందితులను గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నామని సీఐ వివరించారు. యజమాని సాంబశివరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ రామారావు చెప్పారు.



బోల్తా పడిన బోటు, సురక్షితంగా బయటపడ్డ మత్స్యకారులు

భైరవపాలెం సముద్రంలో బోటు బోల్తా

ఆరుగురు మత్స్యకారులను రక్షించిన 'రిలయన్స్' సిబ్బంది

ఐ.పోలవరం, జూలై 24: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం భైరవపాలెం సముద్రంలో బుధవారం ఉదయం ఒక బోటు బోల్తా పడింది. భైరవపాలేనికి చెందిన పెమ్మాడి సూర్యారావు, దండుప్రోలు ఆదినారాయణ, కర్రి శామ్యూల్, పెమ్మాడి మల్లయ్య, పాలెపు ధర్మారావు, డొక్కాడి దొరబాబు సోమవారం సాయంత్రం రిలయన్స్ జెట్టీ సెక్యూరిటీలో పెట్రోలింగ్ విధుల నిమిత్తం ఇంజన్ బోటులో సముద్రంలోకి వెళ్లారు. సముద్ర అలల ఉధృతికి అది బోల్తా పడింది. మత్స్యకారులను రిలయన్స్ సంస్థ సిబ్బంది రక్షించి సురక్షిత ప్రాంతానికి చేర్చారు. దీంతో గ్రామస్తులు, కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు.

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

వేధింపుల ఘటనపై విచారణ

- కాకినాడ జిల్లా ఫైలేరియా అధికారిణి ఫిర్యాదు ఘటనపై విచారణకు ఆదేశించిన కలెక్టర్
- డీఆర్డీఏ ప్రాజెక్టు డైరెక్టర్‌ని విచారణాధికారిగా నియమించిన వైనం
- తన కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ తనతో అసభ్యకరంగా ప్రవర్తించారని బాధితురాలి ఫిర్యాదు
- దీని ఆధారంగా ఇటీవల రాధాకృష్ణపై విచారణ చేపట్టిన ఉన్నతాధికారులు
- ఈలోపు గోదావరిలో దూకి గల్లంతైన సీనియర్ అసిస్టెంట్
- వివాద ఘటనపై మళ్లీ పూర్తిస్థాయి విచారణకు ఆదేశించిన కలెక్టర్

కాకినాడ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఫైలేరియా విభాగం సీనియర్ అసిస్టెంట్ రాధాకృష్ణ తనతో అసభ్యంగా ప్రవర్తించారని ఆ విభాగం ఉన్నతాధి కారిణి ఇచ్చిన ఫిర్యాదుపై లోతైన విచారణ చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ మేరకు పూర్తిస్థాయి విచారణకు డీఆర్డీఏ పీడీని నియమించారు. వాస్తవానికి ఈ విభాగం ఉన్నతాధికారి 15 రోజుల కిందట తన కార్యాలయంలో పనిచేసే సీనియర్ అసిస్టెంట్ తనతో అసభ్యకరంగా ప్రవర్తించారని ఆవేదన వ్యక్తం చేస్తూ డీఎంహెచ్‌వో నరసింహ నాయక్‌కు ఫిర్యాదు చేశారు. దీని ఆధారంగా వైద్య, ఆరోగ్య శాఖ డిప్యూటీ డీఎంహెచ్‌వో శాంతి విచారణ చేపట్టారు. అసలు ఆ రోజు ఏం జరిగింది? ఛాంబర్‌లో ఉన్న మహిళా అధికారిణితో సీనియర్ అసిస్టెంట్ ఏ విధంగా ప్రవర్తించారు? దీనికి కారణాలేంటనే దానిపై బాధితురాలి నుంచి వివరణ తీసుకున్నారు. బాధితురాలి ఆరోపణలపై ఏం సమాధానం చెప్తారని సదరు సీనియర్ అసిస్టెంట్ వివరణ కూడా తీసుకున్నారు. దీనికి సంబంధించి విచారణ నివేదికను విచారణాధికారి జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారికి ఈ నెల 17న అందించారు. నివేదికలో ఏం తేల్చారనే విషయం ఇంకా బయటకు రాలేదు. కానీ ఈలోపు సదరు సీనియర్ అసిస్టెంట్ రాధాకృష్ణ మంగళవారం యానాం వద్ద గోదావరిలో దూకి గల్లంతయ్యారు. ఈ నేపథ్యంలో వివాదం ముదరడంతో మరోసారి సదరు బాధితురాలికి జరిగిన అన్యాయం, అసలు ఆ రోజు ఏం జరిగింది? అనే దానిపై వాస్తవాలు వెలికితీసేలా కొత్తగా జిల్లా డీఆర్డీఏ పీడీతో విచారణ చేయించాలని కలెక్టర్ నిర్ణయించారు. మరోపక్క ఈ వివాదానికి సంబంధించి బుధవారం తన కార్యాలయంలో డీఎంహెచ్‌వో మీడియాతో మాట్లాడారు. ఫైలేరియా విభాగ ఉన్నతాధికారి అయిన బాధిత మహిళ తన వద్ద పనిచేసే సీనియర్ అసిస్టెంట్ తనతో అసభ్యంగా ప్రవర్తించారని ఈ నెల 2న తమకు ఫిర్యాదు చేశారన్నారు. తనను ఇబ్బంది పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యాలయ గదిలో ఇద్దరం పక్కపక్క సీటులోనే కూర్చున్నామని, ఈ క్రమంలో తనతో సీనియర్ అసిస్టెంట్ అసభ్యంగా ప్రవర్తించారని బాధితురాలైన అధికారి తమకు వివరించారన్నారు. ఈ నేపథ్యంలో సదరు ఉద్యోగిని తాను సరెండర్ చేస్తున్నానని పేర్కొంటూ బాధిత అధికారి లేఖ ఇచ్చారు. సరెండర్ ఆమోదించే అధికారం తనకు లేదని, కావాలంటే రాధాకృష్ణను వేరేచోటకు బదిలీ చేస్తానని సదరు బాధితురాలైన అధికారికి చెప్పానన్నారు. కానీ తనకు సదరు సీనియర్ అసిస్టెంట్ ప్రవర్తన, పని విధానం నచ్చలేదని ఆమె తనతో చెప్పారన్నారు. ఈ నేపథ్యంలో సదరు బాధితురాలి ఫిర్యాదుపై విచారణ చేపట్టామన్నారు. 17న నివేదిక వచ్చిందని, దానికి సంబంధించి ఇంకా చర్యలు కూడా ప్రారంభించలేదని, కానీ ఈలోపు రాధాకృష్ణ నదిలోకి దూకారన్న సమాచారం తెలిసిందని వివరించారు.

ఫైలేరియా అధికారిణిపై బదిలీ వేటు

జీజీహెచ్ (కాకినాడ), జూలై 24 జిల్లా వైద్య, ఆరోగ్య శాఖలో ఓ సీనియర్ అసిస్టెంట్ గోదావరిలో పడి గల్లంతవ్వడానికి ఆమె కారణమని ఆరోపణలు ఎదుర్కొంటున్న వైద్యాధికారిణి పై కలెక్టర్ ఆదేశాల మేరకు డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహనాయక్ బుధవారం రాత్రి బదిలీ వేటు వేశారు. ఆమెను తొండంగి మండలం కేపీ పురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి బదిలీ చేశారు.

తుని ఏరియా ఆసుపత్రిలో కుప్పకూలిన పైకప్పు

ఘటనా స్థలంలో 12 మంది రోగులు.. తప్పిన ప్రమాదం

తుని రూరల్, జూలై 24: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు కాకినాడ జిల్లా తుని ఏరియా ఆసుపత్రిలో శ్లాబు నుంచి నీరుదిగడంతో పైకప్పు కుప్పకూలింది. మంగళవారం రాత్రి ఒంటి గంట సమయంలో ఆర్థోపెడిక్ వార్డులో ఈ ఘటన జరిగింది. పై కప్పు కూలి కింద ఉన్న సీలింగ్ మీద పడే క్రమంలో పెద్ద శబ్ధం రావడంతో ఆ వార్డులో ఉన్న 12 మంది రోగులు పరుగులు తీశారు.



డ్యూటీ నర్సులు, వైద్యాధికారుల ఆదేశాల మేరకు వారిని మరో వార్డుకు షిఫ్ట్ చేశారు. ఈ ఘటనపై స్పందించిన ఎమ్మెల్యే యనమల దివ్య... భవనాల పటిష్టతను పరిశీలించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

ప్రకృతి వ్యవసాయంతో రైతులకు మేలు

ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు జిల్లా మేనేజర్ తాతారావు

గోకవరం, జూలై 24:

ప్రకృతి వ్యవసాయ విధానం అవలంబించడం వల్ల రైతులకు, పర్యావరణానికి ఎంతో మేలు జరుగుతుందని ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు జిల్లా మేనేజర్ తాతారావు అన్నారు. మండలంలోని వీరలంకపల్లి గ్రామంలో ఉన్న ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని బుధవారం ఆయనతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన రైతులు, వ్యవసాయ, ఉద్యానవన, ఇరిగేషన్ శాఖలకు చెందిన అధికారులు సందర్శించారు. ఈ సందర్భంగా ప్రకృతి సాగు విధానం, పంట దిగుబడి, పెట్టుబడి తదితర విషయాలను ప్రాజెక్టు మేనేజర్ తాతారావు రైతులకు వివరించారు. ప్రకృతి సాగులో వినియోగించే బీజామృతం, జీవామృతం, ఘన జీవామృతం తయారీ విధానాన్ని కూడా తెలిపారు. పాడి పరిశ్రమతో పాటు ప్రకృతి విధానంలో తాను సాగు చేస్తున్నట్టు ప్రకృతి వ్యవసాయ క్షేత్రానికి చెందిన రైతు కోరిపల్లి అప్పలస్వామి వివరించాడు.

ఏజెన్సీ సమాచారం

పునరావాస కేంద్రాల్లో వరద బాధితులకు
ఇబ్బంది లేకుండా చూడాలి : జేసీ


బాధితులతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ అభిషేక్

ఎటపాక, జూలై 24: గోదావరి వరద బాధితులకు పునరావాస కేంద్రాల్లో ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలని, ప్రభుత్వపరంగా బియ్యం, నిత్యావసరాలను త్వరితగతిన అందించాలని జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజే అభిషేక్ ఆదేశించారు. కాపుగొంపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని బుధవారం ఆయన పరిశీలించి వరద బాధితులకు అందుతున్న సాయంపై ఆరా తీశారు. ఇక్కడ ఎన్ని కుటుంబాల వారు ఉంటున్నారని అడిగి తెలుసుకున్నారు. 40 కుటుంబాల వారు ఉంటున్నామని పునరావాస కేంద్రం సరిపోవట్లేదని జేసీ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన బాధితులకు ఇంకా ఏమైనా భవనాలుంటే చూడాలని తహసీల్దారును ఆదేశించారు. పునరావాస కేంద్రంలో ఎంత మంది అంగన్వాడీ చిన్నారులు ఉన్నారని, వారికి పాలు అందిస్తున్నారా అని వీఆర్వోను జేసీ ప్రశ్నించారు. ఇవ్వట్లేదని వీఆర్వో చెప్పడంతో ఎందుకు ఇవ్వట్లేదని... వెంటనే పాలు ఇవ్వాలని ఆదేశించారు. వరదలతో ప్రతిఏటా ఇబ్బందులు పడుతున్నామని, ముంపులేని చోట ఇళ్ల స్థలాలు మంజూరు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని బాధితులు జేసీని కోరారు. కాగా జేసీ పునరావాస కేంద్రం పరిశీలనకు వస్తున్నా రనే సమాచారంతో ముందుగానే వీఆర్వో హడావుడిగా బాధితులకు నూనె, కందిపప్పు పంపిణీ చేశారు. ఇదిలా ఉండగా అన్ని గ్రామాలకు ముందుగా బియ్యం పంపిణీ చేసి, తమకు ఇవ్వలేదని కాపుగొంపల్లి గ్రామస్తులు జేసీ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఆయన మాట్లాడుతూ... ఈ గ్రామం ముంపులో లేనందునే బియ్యం పంపిణీ చేయలేదని చెప్పారు. తమ గ్రామాన్ని ముంపు జాబితాలో కలపాలని స్థానికులు కోరారు. కృష్ణవరం గ్రామంలో నీటి సమస్య నెలకొందని, పబ్లిక్ చేతి పంపును కొందరు మోటారు అమర్చి వాడుకుంటున్నారని టీడీపీ నాయకుడు దానే రాజు జేసీకి వివరించారు. గ్రామంలో అంతర్గత రహదారులు అధ్వానంగా ఉన్నాయని బాగు చేయాలని కోరారు. కృష్ణవరం గ్రామాన్ని కూడా ముంపు జాబితాలో చేర్చాలని కోరారు.


వరద బాధితులకు నిత్యావసరాలు అందిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

వరద ప్రభావిత గ్రామాల్లో కలెక్టర్ పర్యటన

వరరామచంద్రాపురం, జూలై 24: అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ బుధవారం కూనవరం నుంచి వీఆర్ పురం మండలానికి ట్రాక్టరుపై వచ్చారు. అక్కడి నుంచి నాటు పడవలో వెళ్లి ముంపు గ్రామాల్లో పర్యటించారు. గుట్టలపై గుడారాలు వేసుకున్న జీడిగుప్ప, ములకపల్లి వరద బాధితులను కలెక్టర్ పరామర్శించారు. నిత్యావసర సరకులు అందాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. బాధితులకు నిత్యావసరాలు, కందిపప్పు, దుంపలు, మంచి నూనె, ఉల్లిపాయలను ఆయన స్వయంగా అందజేశారు. వారికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఏమైనా సమస్యలుంటే వెంటనే కంట్రోల్ రూమ్‌కు ఫోను చేస్తే స్పందించి తగు చర్యలు తీసుకుంటామన్నారు. కలెక్టర్ వెంట రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్‌గనోరే, జడ్పీటీసీ వాళ్ళ రంగారెడ్డి వున్నారు.


నిర్వాసితులతో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

గోదావరి వరద తగ్గుముఖం

కూనవరం, జూలై 24: మండల కేంద్రమైన కూనవరం వెళ్లడానికి సినిమా హాలు రోడ్డు దగ్గర వరద తగ్గుముఖం పట్టడంతో పునరావాస కేంద్రంలో ఉన్న నిర్వాసితులు రాకపోకలు ప్రారంభించారు. టేకులబోరు, కోతులగుట్ట రోడ్డుపై చేరిన వరదనీరు సైతం తగ్గింది. కూనవరంతో పాటు అన్ని గ్రామాల్లో నిత్యావసర వస్తువులు దిగుమతి చేశారు. శబరి బెల్టులో ఉన్న శబరి కొత్తగూడెం, మరికొన్ని గ్రామాలు నీటిలోనే ఉన్నాయి. గోదావరి తగ్గుతున్నప్పటికీ కొన్ని గిరిజన గ్రామాలకు మాత్రం రాకపోకలు లేవు. మూడు రోజులుగా బ్యాంకు సేవలు నిలిచిపోయాయి. దీంతో లావాదేవీలకు ఇబ్బందిపడుతున్నారు. పునరావాస కేంద్రాల్లోని వారికి నిత్యావసరాలు అందేలా కలెక్టర్, రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే చర్యలు తీసుకుంటున్నారు. వరద తగ్గుముఖం పట్టడంతో అల్లూరి జిల్లా కలెక్టర్ నీళ్లలోనే ట్రాక్టర్లపై వెళ్లి పలు గ్రామాలను సందర్శించారు. కూనవరంలో ఆయన నిర్వాసితులతో మాట్లాడారు. పోలవరం పరిహారం ఇప్పించాలని, తాము ఈ బాధలు పడలేమని నిర్వాసితులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.

గుర్రం జాషువాకు నివాళి

వై.రామవరం, జూలై 24: గుర్రం జాషువా వర్ధంతి సందర్భంగా పి.యర్రగొండ గురుకుల కళాశాలలో బుధవారం ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ శ్రీపాద రామకృష్ణ మాట్లాడుతూ జాషువా కవిత్వాన్ని ఆయుధంగా చేసుకుని పోరాటం సాగించారన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల్లో వైద్య శిబిరాలు... ఇంటింటా సర్వే

మోతుగూడెం, జూలై 24: మోతుగూడెం పరిధిలోని చదలవాడ, ఎర్రకొండపాకల గ్రామాల్లో బుధవారం వైద్య శిబిరాలు నిర్వహించారు. తులసిపాక పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఉదయ్‌కుమార్‌రెడ్డి, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు సోకులేరు వాగు దాటి వెళ్లి పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఇంటింటా సర్వే చేసి అనారోగ్యంతో ఉన్న వారిని గుర్తించారు.

ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరణ

రాజవొమ్మంగి, జూలై 24: రాజవొమ్మంగిలో ఎమ్మార్పీఎస్ జెండాను మండల అధ్యక్షుడు మొర్త బుజ్జిబాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరూ ఐక్యంగా ఉండి సంఘ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో అయినవెల్లి తాతారావు, గుండేపల్లి జీవరత్నం,బొడపాటి నూకరాజు, గుండేపల్లి అప్పారావు పాల్గొన్నారు.

1/70 చట్టాన్ని అమలు చేసి గిరిజనులకు న్యాయం చేయాలి

దేవీపట్నం, జూలై 24: 1/70 చట్టాన్ని అమలు చేసి గిరిజనులకు న్యాయం చేయాలని గిరిజన రైతు ఈరేటి బ్రహ్మజీ కోరారు. 22 ఏళ్ల నుంచి తాను పొలం సాగు చేసుకుంటుండగా గిరిజనేతరులు దాసరి దుర్గాప్రసాద్, దాసరి నాగు అలియాస్ పాము, దాసరి ఆదినారాయణ, దాసరి వెంకటేశ్వరరావు, ఉద్దరగిరి వెంకటరామారావు, ట్రాక్టర్ డ్రైవర్ ఊట్ల శ్రీనివాసరెడ్డి తన నారుమడిని ట్రాక్టర్‌తో దున్నేశారన్నారు. దీనిపై గిరిజనేతరులైన వాళ్లని అడగ్గా తిరిగి తనపై దాడి చేశారని ఆరోపించారు. కొండదొరల సంఘం జిల్లా నాయకుడు యలగాడ నాగేశ్వరరావు సైతం తనను నోటికి వచ్చినట్టు తిట్టాడన్నారు. కోర్టు ద్వారా సంక్రమించిన ఆస్తి అయినప్పటికీ తనపై దాడి చేశారన్నారు. దీనిపై ఎస్ఐ నాగార్జునను వివరణ కోరగా... ఇరువర్గాలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని వివరించారు.

28న ఉచిత శెట్టిబలిజ వివాహ పరిచయవేదిక

రాజమహేంద్రవరం సిటీ, జూలై 24: రాజమహేంద్రవరం గేదెల నూకరాజు కల్యాణ మండపంలో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి శెట్టిబలిజ సంఘీయుల ఉచిత వివాహ పరిచయ వేదిక నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర శెట్టి బలిజ సంఘం ప్రధాన కార్యదర్శి సానబోయిన రామారావు తెలిపారు. రాజమహేంద్రవరం తిలక్‌రోడ్డులోని సంఘ కార్యాలయంలో మాట్లాడారు. సంఘీయులంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు. తల్లిదండ్రులు వధూవరుల కార్డు సైజ్‌ఫొటోలు, బయోడేటాలతో హాజరుకావాలని సూచించారు. వివరాలకు 92478 64443, ఆర్గనైజింగ్ కమిటీ మట్టపర్తి సత్యనారాయణ 9398925726లో సంప్రదించాలన్నారు.

ఆధార్ నమోదు స్పెషల్ డ్రైవ్ సద్వినియోగం చేసుకోవాలి

● రాజమహేంద్రవరం డిఎల్‌డీవో వీణాదేవి

అనపర్తి, జులై 24 : ఆధార్ నమోదు కోసం ఈనెల 23నుండి 27వ తేదీ వరకు జిల్లాలో నిర్వహిస్తున్న ఆధార్ స్పెషల్ డ్రైవ్‌ను జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవా లని రాజమహేంద్రవరం డీఎల్‌డీవో వీణాదేవి కోరారు. బుధవారం అనపర్తి మండలంలోని పలు ఆధార్ కేంద్రా లను ఆమె పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 0 నుంచి 5సంవత్సరాలలోపు చిన్నారులకు ఆధార్ నమోదుకు ఇది మంచి అవకాశమని అన్నారు. అదేవిధంగా స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా ప్రతి పాఠశాలలోను నమోదుకు ఏర్పా ట్లు చేస్తున్నామన్నారు. మొబైల్ క్యాంపుల ద్వారా పాఠశా ల, కళాశాల విద్యార్థులకు ప్రయోజనం చేకూరు తుందన్నారు. అవసరమైనచోట మొబైల్ క్యాంపుల ఏర్పాటుకు అధికారులు దృష్టి సారించాలని ఆమె సూచించారు. ఈ డ్రైవ్‌లో ఆదార్ నమోదుతోపాటు ఆధార్ అప్‌డేట్, మొబైల్ లింక్ కూడా పొందవచ్చని ఈ సౌకర్యాన్ని ప్రజలంతా వినియోగించుకోవాలని ఆమె సూచించారు. ఈ సందర్భంగా ఆమె వెంట ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.


పాలమూరులో ఆధార్ నమోదు కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎల్‌డీవో వీణాదేవి

విద్యార్థులను దృఢంగా తయారుచేయాలి

●ఏఎంవో గౌరీశంకర్


దివాన్‌చెరువు పాఠశాలలో క్రీడలు ఆడుతున్న విద్యార్థినులు

దివాన్‌చెరువు, జూలై 24: విద్యార్థులను అన్నిరంగాలలో ప్రోత్సహించి వారిని శారీరకంగా మానసికంగా దృఢంగా తయారు చేయాలని సమగ్రశిక్షా జిల్లా మోనటరింగ్ అధికారి గౌరీశంకర్ అన్నారు. శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో మూడోరోజైన బుధవారం క్రీడా దినోత్సవంను నిర్వహించారు. దివాన్‌చెరువులోని జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన ఆటల పోటీలను ఆయన సందర్శించారు. రాజానగరం ఏఎంవో-2 జ్యోతిప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థు లు వివిధ అంశాలపై పట్టుసాధించేందుకు ఈ శిక్షాసప్తాహ్ దోహదపడుతుందని చెప్పారు.

క్రీడలతో మానసికోల్లాసం...

బిక్కవోలు, జూలై 24: క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు, శారీరక దారుఢ్యం పెరుగుతుందని కొంకుదురు ఉన్నత పాఠశాల హెచ్ఎం ఎం.శ్రీనివాస్ విద్యార్థులకు సూచించారు. శిక్షాసప్తాహ్ కార్యక్రమంలో భాగంగా బుధవారం పాఠశాలలో క్రీడా దినోత్సవాన్ని నిర్వహించి పీడీ రాజశేఖర్ ఆధ్వర్యంలో రాష్ట్ర సాంప్రదాయ ఆటలైన ఏడుపెంకులాట, తొక్కుడుబిళ్ల, కళ్లకు గంతలు, కుర్చీలాట వంటివి విద్యార్థులతో ఆడించారు. పందలపాక ఉన్నత పాఠశాలలో పీడీ యువరాజారెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులతో వివిధ రకాల ఆటలు ఆడించామని హెచ్ఎం చిర్ల శ్రీనివాసరెడ్డి తెలిపారు.


బిక్కవోలు: కొంకుదురులో తొక్కుడు బిళ్ల ఆడుతున్న విద్యార్థినులు

ప్రభుత్వ ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలి

గోకవరం, జూలై 24: ప్రభుత్వ ప్రోత్సాహకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కూటమి నాయకులు అన్నారు. మండలంలోని తంటికొండ, గోకవరం జడ్పీ ఉన్నత పాఠశాలలు, డ్రైవర్స్‌కాలనీకి చెందిన ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు ప్రభుత్వం నుంచి మంజూరైన యూనిఫామ్‌లు, బ్యాగులను బుధవారం వారు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గోకవరం సర్పంచ్ కొమ రం శ్రావణి, కూటమి నాయకులు పాలూరి బోస్, మంగ రౌతు రాము, పోసిన ప్రసాద్, పులపర్తి బుజ్జి, బదిరెడ్డి అచ్చన్నదొర, బదిరెడ్డి బాబి, పదిలం మురళి, మహిపాల పండు, దోసపాటి సుబ్బారావు పాల్గొన్నారు.

వరదనీటిలోనే వరిపంట

గోకవరం, జూలై24: అల్పపీడన ప్రభావంతో ఎడతెరపి లేకుండా కురిసిన వర్షాలకు మండలంలోని పలు గ్రామాలలో వరిపంట నీటిలోనే తేలియాడుతోంది. నీరు బయటకు వెళ్లే మార్గంలేక సాగుచేసిన పంట పొలాల్లోనే పొంగిపొర్లుతుంది. మండలంలో సుమారుగా 12,200 ఎకరాల్లో వరి పంట సాగు చేయాల్సి ఉండగా, ఇప్పటి వరకు 6098 ఎకరాల్లో వరి నాట్లు వేశారు. సాగు చేసిన పంటలో సుమారు 208 ఎకరాల పంట వర్షాలకు నీట మునిగినట్లు వ్యవసాయాధికారులు గుర్తించారు. నీట మునిగిన పంటను కాపాడుకోవడం కోసం రైతులు ఒక గ్రాము కార్బెండేజిమ్ లేక 2గ్రాముల మాంకో జెబ్ పిచికారి చేయాలని అధికారులు సూచిస్తున్నారు.

ధ్రువపత్రాలు అందజేత

దివాన్‌చెరువు, జూలై 24 : కుటుంబ అవసరాలకు తోడ్పాటు అందించాలని వినయ్‌సుంకర ఫౌండేషన్ ఛైర్మన్ సుంకర వెంకటేశ్వరరావు మహిళలను కోరారు.. ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత మగ్గం వర్క్ శిక్షణ పూర్తిచేసుకున్న కోటపాడుకు చెందిన 70మంది మహిళలకు ధ్రువ పత్రాలను బుధవారం అందజేశారు. దివాన్‌చెరువులోని ఫౌండేషన్ కార్యాలయంవద్ద జరిగిన కార్యక్రమంలో మేనేజింగ్ ట్రస్టీలు సుంకర నాగేశ్వరరావు, వీరాస్వామి, వినీల, యెనుముల సురేష్, తేజ పాల్గొన్నారు.

‘అయ్యంకి’ సేవలు చిరస్మరణీయం

రంగంపేట, జూలై 24: అఖిల భారత గ్రంథాలయోద్యమానికి విశేష కృషిచేసిన గ్రంథాలయ పితామహుడు "అయ్యంకి వెంకటరమణయ్య" సేవలు చిరస్మరణీయమని రంగంపేట గ్రంథాలయాధికారి నల్లమిల్లి రామకోటేశ్వరరావు అన్నారు. బుధవారం రంగంపేట గ్రంథాలయంలో అయ్యంకి వెంకటరమణయ్య 134వ జయంతి వేడుకలు ఘనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా సీనియర్ పాఠకులు ఉండవిల్లి మాణిక్యం పాల్గొని అయ్యంకి వెంకటరమణయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎం.రామభద్రరావు, పాఠకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వరి సాగులో నాణ్యమైన పద్ధతులు పాటించాలి

● ఏరువాక కేంద్ర కోఆర్డినేటర్ నరసింహారావు

బిక్కవోలు, జూలై 24: రైతులందరూ వరి సాగులో శాస్త్రవేత్తలు, అధికారుల సూచనలు, సలహాలు పాటిస్తే నాణ్యమైన అధిక దిగుబడులు సాధించవచ్చునని రాజమహేంద్రవరం ఏరువాక కోఆర్డినేటర్ డాక్టర్ చల్లా వెంకటనరసింహారావు సూచించారు. బలభద్రపురం గ్రామంలో బుధవారం ఎలుకల నివారణపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ శాస్త్రవేత్తల సూచనలు పాటించడంవల్ల సాధించిన ఉత్పత్తులకు ఎగుమతి అవకాశాలు రావడంతోపాటు అధిక గిట్టుబాటు ధర లభిస్తుందన్నారు. ఎలుకల నివారణకు ఎర-తెర పద్ధతిని వాడే విధానాన్ని ఆయన రైతులకు వివరించారు. అనంతరం రైతులకు ఎలుకల బోనులను అందజేశారు. కార్యక్రమంలో ఏరువాక శాస్త్రవేత్తలు డా. అమ్మాజీ, డా. హైమజ్యోతి, డీఆర్‌డీ ఏడీఏ రామలక్ష్మి, అనపర్తి ఏడీఏ డీవీ కృష్ణ, బిక్కవోలు ఏవో శామ్యూల్‌జాన్ పాల్గొన్నారు.


బలభద్రపురంలో రైతులకు ఎలుకల బోనులు అందజేస్తున్న దృశ్యం

జి.జి.యులో అలనాటి రామచంద్రుడు సినీ సందడి

రాజానగరం, జూలై 24: గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయం (జి.జి.యు) ప్రాంగణంలో అలనాటి రామచంద్రుడు సినీ బృందం బుధవారం సందడి చేసింది. సినిమా ప్రమోషన్ నిమిత్తం జీజీయుకు వచ్చిన యువ నటుడు కృష్ణవంశీ, హీరోయిన్ మోక్ష మాట్లాడుతూ ఆగస్టు రెండోతేదీన విడుదలయ్యే అలనాటి రామచంద్రుడు సినిమాను ప్రతీఒక్కరూ థియేటర్‌లో కుటుంబసమేతంగా చూసి విజయవంతం చేయాలని కోరారు. ఇది సరికొత్త ప్రేమకథాచిత్రం అని అన్నారు. హీరో కృష్ణవంశీ మాట్లాడుతూ జీజీయు ఎంతో విశాలంగా, అహ్లాదకరంగా, సినీషూటింగ్ స్పాట్‌లా ఉందన్నారు. సినీదర్శకుడు చిలుకూరు ఆకాష్‌రెడ్డి మాట్లాడుతూ ఈసినిమా విజయోత్సవయాత్రలో మరోసారి వచ్చి అందర్నీకలుస్తామన్నారు. ఈసినిమాలో ఐదుపాటలు ఉన్నాయని. అవి అందరినీ అలరిస్తాయని చెప్పారు. ఈ సందర్భంగా సినిమాలోని పాటకు విద్యార్థులతో కలసి హీరో కృష్ణవంశీ, హీరోయిన్ మోక్ష డ్యాన్స్ చేశారు. నటీనటులతో సెల్ఫీలు, ఫొటోలు తీసుకునేందుకు విద్యార్థులు పోటీపడ్డారు. అలనాటి రామచంద్రుడులో నటించిన వెంకటేష్ కాకుమాను, దివ్యశ్రీ, స్నేహమాధురి పాల్గొన్నారు.

కర్నాటక, మహారాష్ట్ర రైతులు సత్యదేవానర్సరీ సందర్శన



సత్యదేవానర్సరీని సందర్శించిన రైతులు, అధికారుల బృందం

కడియం, జూలై 24: కడియపులంక పుల్లా చంటియ్య - సత్యదేవానర్సరీని బుధవారం మహారాష్ట్ర, కర్నాటక రాష్ట్రాలకు చెందిన రైతుల బృందం సందర్శించింది. కేంద్ర ప్రభుత్వ అటల్‌భుజల్ యోజనా పథకంలో భాగంగా తాము క్షేత్రసాయి పర్యటనకు వచ్చామన్నారు. ఈ సందర్భంగా సేంద్రియ వ్యవసాయ విధానం, ప్రకృతి వ్యవసాయం ద్వారా నర్సరీల సాగు వంటి విషయాలు తెలుసుకున్నారు. ఏపీ కమ్యూనిటీ మేనేజింగ్ నేచర్ ఫార్మింగ్ (ఏపీసీఎన్ఎఫ్) ద్వారా జిల్లాలో సుమారు 20వేల ఎకరాల్లో సేంద్రియ సాగు అవుతోందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నర్సరీ అధినేత పుల్లా చంటియ్య, ఎండీ పుల్లా పెదసత్యనారాయణ, మెర్ల కృష్ణమూర్తి, చెక్కపల్లి పుల్లయ్య, అడిషనల్ డీపీవో షేక్ మహబూబ్ వలీ, డీడీహెచ్ శ్రీనివాసులు, కర్నాటక, మహారాష్ట్ర కు చెందిన వ్యవసాయ, ఉద్యాన, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ ఉండని ప్రాంతాలివే

కడియం, జూలై 24:ఈనెల 26వ తేదీ ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు వార్షిక మరమ్మతుల నిమిత్తం వేమగిరి విద్యుత్ సబ్‌స్టేషన్‌కు విద్యుత్ సరఫరా ఉండదని ఏపీఈపీడీసీఎల్ రాజమహేంద్రవరం రూరల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఆపరేషన్) దాట్ల శ్రీధర్‌వర్మ ఓ ప్రకటనలో తెలిపారు. కడియం మండలంలో వేమగిరి, కడియం, కడియపుసావరం, జేగురుపాడు గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని వినియోగదారులు సహకరించాలన్నారు.

రంగంపేట: రంగంపేట 33కేవి ఫీడర్ నందు వార్షిక మరమ్మతుల నిమిత్తం, చెట్ల కొమ్మలు తొలగించుట కారణంగా శుక్రవారం రంగంపేట విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ ఫీడర్లుకు విద్యుత్ సరఫరాను నిలుపుదల చేయనున్నట్లు రాజమహేంద్రవరం విద్యుత్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ దాట్ల శ్రీధర్‌వర్మ తెలిపారు.

కోరుకొండ : ఈ నెల 26వ తేదీ శుక్రవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు 33/11కేవీ కోరుకొండ సబ్‌స్టేషన్ పరిధిలో నర్సాపురం ఫీడర్, 33/11కేవీ గాడాల,బూరుగుపూడి సబ్‌స్టేషన్ వార్షిక మరమ్మత్తుల నిమిత్తం సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు విద్యుత్ ఏఈ డి.శ్రీధర్ వర్మ తెలిపారు.

పంటపొలాలను పరిశీలించిన వ్యవసాయ అధికారులు

● 1260 ఎకరాల పంట నష్టం

రాజమహేంద్రవరం రూరల్, జూలై 24: అధిక వర్షాల వల్లన వరిపంటకు జరిగిన నష్టాలను అంచనా వేసేందుకు వ్యవసాయ అధికారులు బుధవారం రూరల్‌లో తొర్రేడు, కోలమూరు. కాతేరు, హుక్కుంపేట, బొమ్మూరు, ధవళేశ్వరం గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా రైతులతో చర్చించి పంటలను పరిశీలించారు. జల్లకాలువ ప్రభావంతో తొర్రేడు గ్రామంలో 440 ఎకరాలు, కోలమూరులో 257 ఎకరాలు, కాతేరులో 442 ఎకరాలు కలిపి మొత్తం 1139 ఎకరాలు రైతులు నష్టపోయారని అంచనవేసారు. అదేవిధం దవళేశ్వరం ఆవకాలువ వల్లన హుక్కుంపేటలో 50 ఎకరాలు, బొమ్మూరులో 50 ఎకరాలు, ధవళేశ్వరంలో 21 ఎకరాలు కలిపి మొత్తం 121 ఎకరాలు నష్టపోయినట్లు నిర్ధారించారు. పిలక దశలో పంటనీట మునిగితే పూర్తిగా బయటకు తీసివేసి పైపాటుగా ఎకరానికి 20 కిలోల యూరియా,20 కిలోల మ్యూరేట్‌ఆఫ్ పొటాష్ అదనంగా వేసుకోవాలని , ఈ విదంగా బూస్టర్ డోస్ వేసుకోవడం వలన మొక్క ముంపుప్రభావం నుంచి త్వరగా కోలుకుంటుందని , మొక్క కోలుకున్న తర్వాత కుళ్ళు తెగుళ్ళు రాకుండా లీటరు నీటికి ఒక గ్రాము కార్బెండిజం కలిపి పిచికారీ చేయాలని సూచించారు. రైతులు గోదావరి ఎడమగట్టు అవుట్ ఫాల్ స్లూయిస్ 13 కిమీ కాతరు వద్ద జల్లకాలువ ఫ్లాప్ గేట్లు పాడైపోయాయని దీని వల్లన గోదావరి వరద ఉధృతి పెరిగిన వరద నీరు కాలువలోకి వచ్చి జల్లకాలువ పరివాహక ప్రాంతమంతా కాతేరు. కోలమూరు, తొర్రేడు గ్రామాలలో వరిపంట నీటమునిగి పంట దెబ్బతినడం జరిగిందని దినికి శాస్వత ప్రాతిపదికన ద్వారా ఫ్లాప్ గేట్లు 3 బాగుచేయించి, కాలువ ఆక్రమణలు తొలగించి, పూడిక తీయించి లిఫ్ట్ విధానం ద్వారా జల్లకాలువ నుంచి గోదావరిలోకి నీరు ఎత్తిపోసేవిధంగా ఏర్పాట్లు చేయాలని రైతాంగం అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.


పంట పొలాల వద్ద రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయ అధికారులు

కేంద్ర బడ్జెట్ సంతోషాన్ని కలిగించింది

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు దత్తు

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 24 : కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి వరాలు కురిపించడం సంతోషాన్ని కలిగించిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు అన్నారు. రాజమహేంద్రవరం బీజేపీ కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. రాజధాని అమరావతి నిర్మాణానికి రూ.15 వేల కోట్లు ప్రత్యేక ఆర్థికసాయం ప్రకటించడం గొప్ప విషయమని అన్నారు. పోలవరం ప్రాజెక్టును కేంద్రమే నిర్మిస్తుందని చెప్పారన్నారు. ప్రధాని మోదీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ రాష్ట్ర అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిసారించినందుకు ధన్యవాదాలు తెలియజేస్తున్నామని పేర్కొన్నారు. ఈనెల 26న కార్గిల్ దివస్ సందర్భంగా భారతీయ జనతా యువమోర్చా ఆధ్వర్యంలో అమరవీరులకు నివాళులర్పిస్తూ లాలా చెరువు సెంటర్లో కాగడాల ప్రదర్శన చేపట్టడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రేలంగి శ్రీదేవి, నాయకులు అడబాల రామకృష్ణారావు, కురగంటి సతీష్, ఎనుముల రంగబాబు, వీరా వీరాంజనేయులు, కాలెపు సాయిరాం, కందికొండ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధికి దోహదపడేలా కేంద్ర బడ్జెట్

దివాన్‌చెరువు, జూలై 24: కేంద్రబడ్జెట్ ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి దోహదపడే విధంగా ఉందని కడియం రైల్వే సలహామండలి సభ్యుడు బొమ్ముల సతీష్ అన్నారు. గత ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు రాజధాని లేకుండా చేశారని బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో విమర్శించారు. పోలవరం ప్రాజెక్టు వ్యయం పూర్తిగా కేంద్రప్రభుత్వం భరించి పూర్తి చేస్తాననడం హర్షణీయమన్నారు.

హాస్టళ్లలో సమస్యలు పరిష్కరించాలని వినతి


ఆర్డీవో చైత్ర వర్షిణికి వినతిపత్రం అందజేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 24 : జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టళ్లలో విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని పీడీఎస్‌యూ జిల్లా కార్యవర్గం డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.కిరణ్‌కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.భానుప్రసాద్ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం ఆర్డీవో చైత్ర వర్షిణికి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా హైస్కూల్ విద్యార్థులకు నెలకు రూ.3 వేలు, కాలేజీ హాస్టల్ విద్యార్థులకు నెలకు రూ.4 వేలు చొప్పున మెస్ ఛార్జీలు, కాస్మోటిక్ ఛార్జీలు పెంచాలని కోరారు. మెను కచ్చితంగా అమలు చేయాలని, అధికారులు పర్యవేక్షించాలన్నారు.కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు దినేష్‌కుమార్, మధు, రోహిత్, సతీష్, శ్రీను, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గుర్రం జాషువాకు ఘన నివాళి

రాజమహేంద్రవరం సిటీ, జూలై 24 : కవియుగ చక్రవర్తి గుర్రం జాషువా అని జిల్లా ఎస్సీఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు కోరుకొండ చిరంజీవి అన్నారు. జాషువా 53వ వర్ధంతిని పురస్కరించుకుని రాజమహేంద్రవరం రత్నం ప్రింటర్స్ కార్యాలయంలో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రత్నం ప్రింటర్స్ అధినేత ధారా యేసురత్నం, ఎస్సీఎస్టీ నాయకులు తాళ్ళూరి బాబు రాజేంద్రప్రసాద్, ఎంపీడీ కృపావరం, మోతా నాగలక్ష్మి, ఉసురుమర్తి రామారావు, చాపల రాజు తదితరులు పాల్గొన్నారు.

మహిళా చట్టాలపై అవగాహన ఉండాలి

● డీఎల్ఎస్ఏ కార్యదర్శి ప్రకాశ్

రాజమహేంద్రవరం, జూలై 24(ఆంధ్రజ్యోతి): మహిళా చట్టాలపై అందరికీ అవగాహన ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.ప్రకాశ్ బాబు పేర్కొన్నారు. స్వాతి మహిళా సంఘం, నారీ సాక్ష్యం సంయుక్త ఆధ్వర్యంలో డీఎల్ఎస్ఏ సహకారంతో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. స్త్రీలు వారి హక్కులను ఉపయోగించుకొని అభివృద్ధి, అన్ని రంగాల్లోనూ అభ్యున్నతి సాధించాలన్నారు. ఉచిత న్యాయ సహాయం కోసం డీఎల్ఎస్ఏని సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ ఎం.లక్ష్మీ సూర్యప్రభ, దిశ పోలీస్ స్టేషన్ డీఎస్పీ ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

సెంట్రల్ జైలును సందర్శించిన ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు

రాజమహేంద్రవరం, జూలై 24(ఆంధ్రజ్యోతి): సోషల్ వర్క్, రాజనీతి శాస్త్ర విభాగాల క్షేత్ర పర్యటనలో భాగంగా ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు ఆయా విభాగాల అధ్యాపకులు సయ్యద్ పర్వా, సీతా మహాలక్ష్మీ, రాణి ఆధ్వర్యంలో బుధవారం సెంట్రల్ జైలును సందర్శించారు. జైలులోని అంశాల గురించి సూపరింటెండెంట్ రాహుల్, డిప్యూటీ సూపరింటెండెంట్ రవికుమార్ విద్యార్థులకు వివరించారు.

న్యాయవాదుల రక్షణ చట్టం అమలు చేయాలి

రాజమహేంద్రవరం సిటీ, జూలై 24 :న్యాయవాదుల రక్షణ చట్టం అమలు చేయాలని కోరుతూ రాజమహేంద్రవరం గోకవరం బస్టాండ్ అంబేడ్కర్ విగ్రహం వద్ద అడ్వకేట్స్ వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు బుధవారం ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా సొసైటీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ధర్నాలకోట వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఎల్లప్పుడూ ప్రజల హక్కుల పరిరక్షణ కోసం కృషి చేసే న్యాయవాదులకు రక్షణచట్టం లేకపోవడం శోచనీయమన్నారు. ఇప్పటికైనా కేంద్రం పార్లమెంట్ సమావేశాల్లో అడ్వకేట్స్ ప్రొటెక్షన్ యాక్టును ప్రవేశపెట్టి అమలు చేయాలని కోరారు. సొసైటీ రాష్ట్ర కార్యదర్శి బీరా అరుణ్ కుమార్ మాట్లాడుతూ దేశంలో న్యాయవాదులంతా ఈ యాక్ట్ కోసం ఎదురుచూస్తున్నామని వెంటనే కేంద్రం స్పందించి రక్షణ చట్టాన్ని అమలు చేయాలన్నారు. సొసైటీ ఉపాధ్యక్షుడు కాశి శ్రీనివాసరావు, మలక శ్రీనివాస్‌లు మాట్లాడుతూ నానాటి న్యాయవాదులకు రక్షణ కరువైందన్నారు. కేంద్రం స్పందించాలన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు వాకా విజయలక్ష్మి, ఎస్ ప్రవీణ్ కుమార్, వి.జస్వంత్ కుమార్, బి.నాగసాయి, యు శ్రీనివాస్, ఎం.సురేష్, దండంగి అజయ్, ఎం.మురళీ, మొగ్గ శ్రీను తదితరులు పాల్గొన్నారు.







ముంపులోనే : కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో ఇలా..

తగ్గని గోదారి : రాజమహేంద్రవరం పుష్కరఘాట్ వద్ద 55 అడుగుల నీటిమట్టం

రాజమహేంద్రవరం నా సొంతింటితో సమానం

సంతృప్తిగానే వెళుతున్నా : కమిషనర్ దినేష్ కుమార్



రాజమహేంద్రవరంసిటీ, జూలై 24 : రాజమహేంద్రవరం నగరం నా సొంతింటితో సమానం అని కమిషనర్ దినేష్ కుమార్ అన్నారు. గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్‌గా బదిలీ అయిన నేపథ్యంలో రాజమహేంద్రవరంతో ఉన్న అను బంధాన్ని గుర్తుచేసుకున్నారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. గతంలో తెనాలి, నెల్లూరు కమిషనర్లుగా పనిచేసినా రాజమహేంద్రవరంతో ఉన్న అనుబంధం వేరన్నారు.చారిత్రాత్మక నగరానికి కమిషనర్‌గా చేయడం నా అదృ ష్టంగా భావిస్తున్నానని చెప్పారు. తాను బాధ్యతలు చేపట్టినప్పుడు కొంత ఇబ్బందులు ఎదుర్కొన్నప్పటికీ ఆటుపై అధికారుల సమన్వయంతో నగరాన్ని తీర్చిదిద్దాలనే ఆలోచనతో ముందుకు సాగానని చెప్పారు. నగర ప్రజలు కూడా తాము ఏ నిర్ణయం తీసుకున్నా దానిని స్వాగతించడం మర్చిపోలేదన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో టాప్ 20లో ర్యాంక్ సాధించాలని అనుకున్నా.. క్వారీ ప్రాంతం డంపింగ్ యార్డుల్లో చెత్త తరలించడం కుదరక ర్యాంక్ సాధించలేపోయామన్నారు. గతం లో 94 ఉన్న ర్యాంక్‌ను 54కు చేర్చామన్నారు. నగరపాలక సంస్థ ఆదా యాన్ని రూ.55 కోట్ల నుంచి రూ.75 కోట్లకు పెంచామన్నారు. నేను సంతృప్తిగానే రాజమహేంద్రవరం నుంచి వెళుతున్నానన్నారు.

నేడు కమిషనర్‌గా కేతన్ గర్గే బాధ్యతల స్వీకరణ



రాజమహేంద్రవరం సిటీ, జూలై 24 : రాజమహేంద్రవరం కమిషనర్‌గా కేతన్ గర్గే గురువారం బాధ్యతలు స్వీకరించనున్నారు. ఇప్పటివరకు కేతన్ గర్గే అనంతపురం జిల్లా జాయింట్ కలెక్టర్‌గా పనిచేశారు. ఇప్పటి వరకు రాజమహేంద్రవరం కమిషనర్ గా పనిచేసిన దినేష్ కుమార్ గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్‌గా బదిలీ అయ్యారు. రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్ పిఎం సత్యవాణికి బుధవారం రాత్రి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించి దినేష్ కుమార్ రిలీవ్ అయ్యారు. గురువారం ఉదయం 10 గంటలు దాటక కేతన్ గర్గే బాధ్యతలు స్వీకరించనున్నారు.

నిఫా వైరస్‌పై జీజీహెచ్ అప్రమత్తం

నలుగురు వైద్యులతో రాపిడ్ రెస్పాన్స్ టీం ఏర్పాటు

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 24 : కొత్త రకం వైరస్ నిఫాపై రాజమహేంద్రవరం జీజీహెచ్ అధికారులు అప్రమత్తమయ్యారు. ఈ మేరకు నలుగురు అసిస్టెంట్ ప్రొఫెసర్ స్థాయి వైద్యులతో కూడిన రాపిడ్ రెస్పాన్స్ టీంను ఏర్పాటు చేశారు. డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ ఆదేశాల మేరకు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీ సూర్యప్రభ వైద్యుల బృందాన్ని నియమించారు. తక్షణమే చర్యలు చేపట్టాలని ఆదేశాలిచ్చారు. ఈ రాపిడ్ రెస్పాన్స్ టీంలో డాక్టర్ ఎం.కిరణ్ (రెస్పిరేటరీ మెడిసిన్), డాక్టర్ వై.శశాంక నీలం (జనరల్ మెడిసిన్), డాక్టర్ టీవీపీఎస్ మహేంద్ర (అనస్థీషియా), డాక్టర్ ఎం.ఆనంద సత్యతేజ్ (మైక్రోబయాలజీ) ఉంటారు. వైద్యుల బృందం పుణెలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ సూచించిన మార్గదర్శకాలకు అనుగుణంగా అనుమానితులకు సంబంధించిన వివరాలను కేస్ ఇన్వర్మేషన్ ఫార్మ్ (నిఫా వైరస్) ద్వారా పూర్తి సమాచారాన్ని పంపించాల్సి ఉంటుందని సూపరింటెండెంట్ పేర్కొన్నారు.



నిండు గోదారి : రోడ్ కం రైలు బ్రిడ్జి వద్ద గోదావరి ఉధృతి

శాంతించిన నది!

గోదారి వరద తగ్గుముఖం

రాజమహేంద్రవరం సిటీ/కొవ్వూరు, జూలై 24 : ముంపు వీడలేదు.. ముప్పు వీడ లేదు.. గోదావరి వరద ఉధృతి తగ్గలేదు..అటు భద్రాచలం .. ఇటు ధవళేశ్వరం వద్ద రెండో ప్రమాద హెచ్చరిక కొనసాగుతూనే ఉంది. దీంతో గోదావరి పరీవాహక ప్రాంత ప్రజలు ఇంకా భయం భయంగానే గడుపుతున్నారు. ఎగువన భద్రాచలం వద్ద తగ్గుముఖం పట్టినా ధవళేశ్వరం వద్ద వరద ఉధృతి కొనసాగుతోంది.. ధవళేశ్వరం వద్ద బుధవారం తెల్లవారుజామున 14.90 అడుగుల వరకు పెరిగిన నీటిమట్టం ఆపై 8 గంటల పాటు నిలకడగా కొనసాగింది. మధ్యాహ్నం 12 గంటలకు నెమ్మదిగా తగ్గుముఖం పడుతూ రాత్రి 7 గంటలకు 14.60 అడుగులుగా నమోదైంది. రాత్రి 11 గంటలకు 14.40 అడుగులకు నీటిమట్టం చేరింది. కాటన్ బ్యారేజ్ నుంచి 13,61,297 లక్షల క్యూసెక్కులు సముద్రంలోకి ప్రవహిస్తుంది.ఈ సారి కాటన్‌బ్యారేజ్ నుంచి అత్యధికంగా 14,56,651 క్యూసెక్కులు ప్రవాహం సముద్రంలోకి ప్రవహించింది. ప్రస్తుతం ప్రమాద హెచ్చరికలు కొనసాగుతుండగా నీటిమట్టం తగ్గుముఖం పడుతూ ఉండడ ంతో గురువారం ఉదయానికి రెండో ప్రమాద హెచ్చరిక ఉపసంహరించేస్థాయికి నీటి మట్టం తగ్గుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఎందుకంటే భద్రాచలం నుంచి వరద ధవళేశ్వరం కాటన్ బ్యారేజ్‌కి చేరుకోవడానికి సుమారు 18 గంటలు పడుతుంది. దీంతో అఖండ గోదావరి ఇంకా ఉధృతంగానే పొంగి ప్రవహిస్తుంది. రాజమహేంద్రవరంలోని హేవ్‌లాక్ బ్రిడ్జి, ఆర్చ్ బ్రిడ్జిల మధ్య వరద



శివపాదాన పుట్టావంట గంగమ్మ.. శ్రీహరి పాదాన పుట్టావంట గంగమ్మ.. రాజమహేంద్రవరం గోదావరి గట్టున ఉన్న నీలకంఠేశ్వరస్వామి ఆలయం వద్ద గోదారమ్మ శివయ్యను తాకివెళుతున్న ఈ దృశ్యం చూపరులను ఆకట్టుకుంటుంది.

ప్రవాహం చాలా వేగంగా వెళుతోంది. పుష్కరాలరేవులో గోదావరి వరద 55 అడుగులకు చేరింది.పుష్కరాల రేవు నుంచి ఎగువ కాతేరు వైపు గోదావరి వస్తున్న తీరు భయానకంగా ఉంది. కనుచూపుమేరలో అంతా వరదనీరే కనిపిస్తుంది.కొవ్వూరు గోష్పాదక్షేత్రంలోని ఆలయాలన్నీ రెండో రోజు వరద ముం పులోనే ఉన్నాయి. రాజమహేంద్రవరంలో కోటిలింగాలరేవు, చింతాలమ్మరేవు, పుష్కరాలరేవు, జీవకారుణ్యం రేవు, టీటీడీ ఘాట్, శ్రద్ధానంద ఘాట్, లాంచీల రేవు, పిండాలరేవు,దోబీఘాట్, సరస్వతి ఘాట్, గౌతమి ఘా ట్లు మునిగిపోయాయి.దీంతో ఆయా రేవులను మూసివేశారు.పుష్కరాలరేవులో నిత్య హారతిచ్చే ఘాట్ మొత్తం నీటమునిగింది. అధికారులు ముందస్తు చర్యల్లో భాగంగా ప్రతి ఘాట్‌లో పోలీస్ పహరా ఏర్పాటు చేశారు.గోష్పాదక్షేత్రానికి వెళ్ళే అన్ని రహదారులు బారికేడ్లు ఏర్పాటుచేసి మూసివేశారు.పోలీసు, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది 24 గంటలు మూడు షిఫ్టులుగా పర్యవేక్షిస్తున్నారు.మెడికల్ క్యాంపులు కొనసాగిస్తున్నారు. కొవ్వూరు గోష్పాదక్షేత్రం వద్ద వరదను డీఎంహెచ్‌వో వెంకటేశ్వరరావు పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. వరద బాధిత ప్రాంతాల్లో శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు.

- ధవళేశ్వరం వద్ద నిలకడగా గోదారి
- 14.40 అడుగులకు నీటిమట్టం
- 13.61 లక్షల క్యూసెక్కులు దిగువకు
- ఇంకా రెండో ప్రమాద హెచ్చరిక
- నేడు విరమించే అవకాశం
- నీట మునిగిన గోదావరి ఘాట్లు
- బారికేడ్లతో మూసివేత
- నీటి ముంపులోనే లంకలు
- భద్రాచలం వద్ద తగ్గిన వరద

మద్దూరులంకలో ఏటిగట్టు పటిష్టత..

కొవ్వూరు మండలం మద్దూరులంక గ్రామంలో బలహీనంగా ఉన్న ఏటిగట్టును ఇసుక బస్తాలతో మరింతగా పటిష్టపరిచారు. ఫ్లడ్ ప్రత్యేక అధికారి, టూరిజం శాఖ డిప్యూటీ కలెక్టర్ స్వామినాయుడు, కొవ్వూరు తహశీల్దార్ కె.మస్తాన్ పర్యవేక్షించారు. హెడ్ వాటర్ వర్క్సు ఈఈ కాశీవిశ్వేశ్వరరావు, సిబ్బందితో మద్దూరు లంక గ్రామాన్ని సందర్శించారు. వరద పరిస్థితిని చూశారు. గ్రామం చుట్టూ ఉన్న ఏటిగట్టును పరిశీలించి పటిష్ట పరచడానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తామన్నారు. వరద ఉధృతి తగ్గకపోవడంతో మద్దూరులంక గ్రామంలో ప్రత్యేక శానిటేషన్, మెడికల్ క్యాంపులు కొనసాగిస్తున్నామని తహశీల్దార్ మస్తాన్ తెలిపారు. వరద మరలా పెరిగితే మద్దూరులంక, పల్లిపాలెం గ్రామాల్లో ముంపు బాధితులను తరలించడానికి మద్దూరు జడ్పీ హైస్కూల్‌లో పునరావాస కేంద్రాన్ని కొనసాగిస్తున్నామన్నారు. రాజమహేంద్రవరంలో కేతావారిలంక, బ్రిడ్జిలంక, తదితర లంకల నుంచి సుమారు 400 మంది మత్స్యకారులను చందాసత్రం, మునిసిపల్ కల్యాణ మండపంలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు తరలించారు. గోదావరి రేవులన్నీ అధికారులు మూసివేయడంతో ప్రజలు ఆయా రేవుల వద్ద ఏర్పాటు చేసిన బారికేడ్లు, కర్రలతో నిర్మించిన అడ్డుకట్టల నుంచే గోదావరిని తిలకిస్తున్నారు. నదీ ప్రవాహం ప్రమాదకర స్థాయిలో ఉండడంతో ప్రజలెవ్వరిని గోదావరి సమీపంలోకి అనుమతించడంలేదు.

ముంచేసిన కొవ్వాడ



తాళ్ళపూడి, జూలై 24 : కొవ్వాడ వరద ముంపు కారణంగా తాళ్ళపూడి మండలంలోని తిరుగుడుమెట్ట, అన్న దేవరపేట, గజ్జరం, ములకలపల్లి తదితర గ్రామాల్లో వరి పొలాలు చెరువులను తలపిస్తున్నాయి. పంట పొలాల్లో నీరు బయటకు రాక రైతాంగం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.తాళ్ళపూడి మండలంలో 1448 ఎకరాల్లో వరి పొలాలు నీట మునిగినట్టు ఏవో రుచిత తెలిపారు.

పెరవలిలో వర్రీయే..



పెరవలి, జూలై 24 : ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలతో కానూ రు, నడిపల్లి,ఉసులుమర్రు, కానూరు అగ్రహారం గ్రామాల పరిధిలో పొలాలు ముంపునకు గురయ్యాయి.సరైన డ్రెయినేజీ వ్యవస్థ లేక నీరు నిలిచి పంటలు పాడయ్యే పరిస్థితికి చేరుకున్నాయి. మంత్రి దుర్గేష్, కలెక్టర్ ప్రశాంతి ఆదేశాల మేరకు కానూరులో మురుగు డ్రెయిన్ తవ్వకం పనులు జరుగుతున్నాయి.ఉసులుమర్రు ప్రాంతంలో మాత్రం సుమా రు 1000 ఎకరాలు భూములు ఇంకా ముంపులోనే ఉన్నాయి.



చెరువా.. రోడ్డా : ఇటీవల కురిసిన వర్షానికి కంబాలచెరువు హైటెక్ బస్టాండ్ వద్ద చెరువులా మారిన రోడ్డు

ఛీ..జన్!

వైసీపీ నిర్లక్ష్యం..జనానికి నరకం


- ఐదేళ్లుగా సిల్ట్‌తో నిండిన డ్రెయినేజీలు
- చినుకు పడితే చెరువులుగా రోడ్లు
- కనీస చర్యలు చేపట్టని గత పాలకులు
- ప్రస్తుతం జనానికి ప్రత్యక్ష నరకం
- వరదొస్తే రూరల్.. వానొస్తే నగరం
- ముంపుతో తీవ్ర సతమతం
- చెరువులు మూసేయడంతో చిక్కు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

వైసీపీ నిర్వాకం..జనాలకు నరకం చూపిస్తుంది.. ఐదేళ్ల పాలనలో ముంపు సమస్యను గాలికొదిలేయడంతో నేడు వాన పడితే వణుకు మొదలైపోతోంది. ప్రధానంగా రాజమహేంద్రవరాన్ని డ్రైనేజీ సమస్య పట్టిపీడిస్తోంది. వైసీపీ నేతలు తమ ప్రాపకం కోసం ఇష్టానుసారం మౌఖిక ఆదేశాలివ్వడం..వాటికి మునిసిపల్ అధికారులు తలూపడం కారణంగా డ్రెయినేజీల్లో పారాల్సిన నీరు రోడ్లను ముంచేస్తోంది. 'నీళ్లు పల్లమెరుగు' అని చదువు లేని వాళ్లకు కూడా తెలుసు. కానీ నగరపాలక సంస్థ పరిధిలో జరిగిన డ్రైన్లు, డివైడర్ల నిర్మాణాలు చూసి ఇంజనీరింగ్ చదువులు నవ్విపోతుండడంపై 'ఆంధ్రజ్యోతి' కథనం.

చినుకు పడిందా..రోడ్లు చెరువులే..

రాజమహేంద్రవరాన్ని ముంపు నీటి సమస్య పీడిస్తూనే ఉంది. వర్షాకాలం వస్తే తుమ్మలోవ, ఆనంద్‌నగర్, ఇన్నీసుపేట, ఆర్యాపురం, సావిత్రినగర్, రామకృష్ణానగర్ తదితర ప్రాంతాలు జలమయవుతున్నాయి. రైల్వే స్టేషను, క్వారీ మార్కెట్ తదితర రోడ్లపైకి ముంపు నీరు వచ్చి చేరుతోంది. డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో ఆ నీరు ఎటు వెళ్లాలో తెలియక నిలిచిపోతోంది. వర్షం కురిస్తే కంబాల చెరువు హైటెక్ బస్టాండ్ వద్ద బురదను శుభ్రం చేయడం నగరపాలక సంస్థ పారిశుధ్య విభాగానికి పెద్ద తలనొప్పిగా మారింది. ఎక్కడైనా అభివృద్ధి చేస్తే పరిస్థితి కాస్త మెరుగుపడుతుంది. రాజమహేంద్రవరంలో మాత్రం దిగజారింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎంపీగా ఉన్న వ్యక్తి ఆర్భాటాల కోసం చేసిన పనుల చేటు ఇప్పుడు కనిపిస్తోంది.ఇష్టానుసారం డ్రైన్లు, డివైడర్లు నిర్మించేశారు. ఇంజనీరింగ్, పారిశుధ్య అధికారులను నోరు విప్పనీయలేదు.దీంతో డ్రైనేజీల నిర్మాణంలో శాస్త్రీయత కొరవడింది. బిల్లుల రూపంలో కోట్లాది రూపాయలు మాత్రం వైసీపీ నేతల జేబుల్లోకి వెళ్లిపోయాయి. నిర్మాణాల్లో నాణ్యత కొరవడడంతో మూణ్నాళ్ల ముచ్చటను తలపిస్తున్నాయి. వైసీపీ నేతల నిర్వాకానికి లాలా చెరువు నుంచి వై.జం క్షను వరకూ నిర్మించిన డ్రైను ఒక గొప్ప ఉదాహరణ. డ్రైనులో పూడిక తీయడానికి ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్ నుంచి మొదలుకొని ఎక్కడా మ్యాన్‌హోల్స్ లేవు.మొత్తం ఆ చివర నుంచి ఈ చివర వరకూ పూర్తిగా మూసేశారు. పైగా ఫుట్‌పాత్ అంటూ బిళ్లలు అతికించారు. దీంతో డ్రైనులో వ్యర్థాలు పేరుకుపోయి ముంపు నీళ్లు రోడ్లపైకి వస్తోంది. ఒక్కోసారి ఆర్ట్స్ కళాశాల వద్ద మురుగు నీరు పొంగి విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. మేనకాబార్, క్వారీ మార్కెట్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ముంపు నీరు ముంచేస్తోంది. జాంపేట మార్కెట్ ప్రాంతంలో అడ్డ వీధుల్లో నిర్మించిన డ్రైన్ల అవుట్‌లెట్ మెయిన్ డ్రైన్ కిందకు చేరుతుంది. దీంతో ఆ వీధులు జల మయం అవుతున్నాయి. దీనికితోడు కంబాల చెరువు నుం చి క్వారీ మార్కెట్‌కి వెళ్లే రోడ్డులో డివైడర్లు నిర్మించారు. అప్పటి వరకూ అవతల వైపున ఎత్తు నుంచి ఇటువైపు పల్లపు డ్రైనులోకి ముంపు నీరు ప్రవహించేది.కానీ డివైడరు కట్టినప్పుడు చిన్నపాటి గొట్టాలు మాత్రమే అమ ర్చడంతో అది వ్యర్థాలతో మూసుకుపోయి డ్రైనులో నీళ్లు రోడ్డుపైకి చేరుతున్నాయి.దేవీచౌక్ తదితర ప్రాంతాల్లోనూ ఇదే దుస్థితి ఉంది. ధవళేశ్వరంలోక్వారీ కాల్వను శుభ్రం చేయించకపోవడంతో అక్కడా నీటిముంపు తప్పడంలేదు.



సావిత్రినగర్‌లో నీట మునిగిన రోడ్డు

కంబాల చెరువు..గుండె బరువు..

వైసీపీ అధికారంలోకి రాక మునుపు కంబాల చెరువు చాలా మటుకు ముంపు నీటికి సమాధానంగా ఉండేది. కానీ వైసీపీ హయాంలో మాజీ ఎంపీ ఈ చెరువుకు ఏకంగా రూ.13 కోట్ల ప్రజాధనాన్ని ధారపోసి సోకు చేశారు.ఆ డబ్బుతో కంబాల చెరువును కంపు చెరువుగా మార్చేశారు. చారిత్రక నేపథ్యం ఉన్న ఈ చెరువు ఇప్పుడు దేనికీ ఉపయోగం లేకుండా మారిపోయింది.నాగుల చెరువులో స్టేడియం కట్టిస్తామని ఆయనే చెప్పారు. ఈ క్రమంలో చెరువులకు అనుసంధానం కూడా తెగిపోయింది. ముంపునీటికి ఎటు పారాలో తెలియక ఇళ్లను ముంచెత్తుతోంది.ఆర్భాటాలకు డబ్బును ధారాళంగా ఖర్చు చేసిన వైసీపీ నేతలు శివారుల్లో డ్రైన్లు నిర్మించడమే మరిచారు.

పరిష్కారమిదేనా..

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ పరిధిలో 60 కిలోమీటర్లకుపైగా మీడియం, 8 కిలోమీటర్ల వరకూ మేజర్ డ్రైన్లు ఉన్నాయి. వీటి అవుట్‌లెట్లు.. జంక్షన్ పాయింట్లు సరిగా లేవు. రెండు కంటే ఎక్కువ డ్రైన్లు కలిసే జంక్షను పాయింట్లు చోకింగ్ పాయింట్లుగా మారుతున్నాయి. ప్రస్తుతం ముంపు నీటిని పంపింగ్ చేయడం ద్వారా క్లియర్ చేస్తున్నారు. తిలక్ రోడ్ తదితర ప్రాంతాల నుంచి సత్యనారాయణపురం మీదుగా మురుగు,ముంపునీరు మురుగు నీటి శుద్ధి కేంద్రానికి చేరుతోంది. ఇటు క్వారీ ఏరియా, విద్యానగర్, భాస్కర్‌నగర్, ఆల్ బ్యాంకు కాలనీ తదితర మెరక ప్రాంతాల నుంచి పల్లపు ప్రాంతాలకు వస్తున్న నీటిని ఎత్తిపోయడం తప్ప వేరే మార్గం లేదు. ప్రస్తుతానికి కోటిలింగాల పేట, బాలికల ఉన్నత పాఠశాల పక్కన,రాజీవ్ పాకల ప్రాంతంలో పంపింగ్ స్టేషన్లు ఉన్నాయి. క్వారీ మార్కెట్, కంబాల చెరువు తదితర ప్రాంతాల మురుగు, ముంపు నీరు నల్లాచానెల్‌కి వెళుతోంది. 45, 46 వార్డుల్లో గాదిరెడ్డి నగర్, కళాకారుల కాలనీ, ఆనంద్ నగర్‌లో ముంపునీటిని ఎత్తిపోసి మెయిన్ డ్రైనులోకి మళ్లిస్తున్నారు. అయితే మరిన్ని డైవర్షన్లు అవసరంగా కనిపిస్తోంది. ఉదాహరణకు క్వారీ ఏరియా నుంచి అటు కాతేరు చెరువుకు పంపింగ్ చేయాలి.రైల్వే స్టేషను గోడను ఆనుకొని మూడడుగుల డ్రైను ఉంది. దాని నిర్మాణంలో వాలు అనే ప్రాథమిక సూత్రం పాటించకపోవడంతో నీరు పారక పూడుకుపోయింది. దీంతో చర్చి దగ్గర నుంచి రిలయన్స్ మార్టు వరకూ ఉన్న డొప్ప వంటి ప్రాంతంలో ముంపు నీరు భారీగా నిలిచిపోతోంది. ఇక్కడ కూడా పరిష్కారం చూపాల్సిన అవసరం ఉంది.



గోదావరి వరద పోటెత్తడంతో రాజమహేంద్రవరం డి మార్టు వద్ద రోడ్డు ఎత్తుకు చేరిన ఆవ కాల్వ నీరు



రామకృష్ణనగర్‌లో ఇలా..

వరదొస్తే.. ఇంతే..

రాజమహేంద్రవరం రూరల్,జూలై 24 : గోదావరి వరద కారణంగా ధవళేశ్వరం సాయిబాబా ఆలయం ప్రాం తంలో ఉన్న ఆవ కాలువను అధికారులు మూసివేశారు. అయినా నీరు ఎగదన్నుతోంది.రాజమహేంద్రవరం అర్బన్, రూరల్ ప్రాంతాల నుంచి వచ్చే వర్షపునీరు, మురుగునీరు గోదావరిలోకి వెళ్లే పరిస్థితి లేకపోవడంతో నీరు వెనక్కి ఎగదన్నుతుంది. రూరల్‌లోని హుక్కుంపేట గ్రామం పరిధిలోని రామకృష్ణనగర్, సావిత్రినగర్, బొమ్మూరు రోడ్డు, బాలాజీ పేట తదితర ప్రాంతాల్లో రోడ్డు పైకి నీరు చేరింది. దీంతో ఆయా ప్రాంతాలు దుర్వాసన వెదజల్లుతున్నాయి. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి ఏటా గోదావరి వరదల సమయంలో ఈ ప్రాంతాలు జలమయం అవుతున్నా శాశ్వత పరిష్కారం లభించడంలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కాటన్ దొరకు ఘన నివాళి



ధవళేశ్వరం, జూలై24: కాటన్ దొర 125వ వర్ధంతిని పురస్కరించుకుని బుధవారం బ్యారేజ్ కూడలిలోని కాటన్ దొర విగ్రహానికి గోదావరి కల్చరల్ అసోసియేషన్ సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.గోదావరిపై ఆనకట్ట నిర్మించి లక్షలాది ఎకరాలకు సాగునీరందించిన గొప్ప వ్యక్తి కాటన్‌దొర అని కొనియాడారు. నీటి పారుదల శాఖ సర్కిల్ కార్యాలయం సమీపంలో గల కాటన్ స్మృతి వనంలోని కాటన్ విగ్రహానికి డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు పూలమాల వేసి నివాళులర్పించారు.కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు రాకా రమణ, కార్యదర్శి యద్రమోతు ధర్మరాజు, పీఎస్ శేషుకుమార్, కేఎస్ గౌరీ శంకర్, ఎం. రమేష్, శ్రీరంగం శ్రీనివాసరావు, మద్దాల అను, ముత్యాల పోసికుమార్, బోడపాటి కుమార్, పందెళ్ళ భాను ప్రసాద్ పాల్గొన్నారు.



ఆవ భూములు పరిశీలించిన కలెక్టర్

కోరుకొండ, జూలై24: ఆవ భూములు, ఇళ్ళస్థలాలు ముంపుకు గురవకుండా చూసేందుకు పరిశీలన చేసి సమగ్ర సమాచారం సేకరించి అధికారులు నివేదిక అందజేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. కోరుకొండ మండలం బూరుగుపూడి గ్రామంలో బుధవారం ఆవభూముల్లో ఇళ్ళ పట్టాలు ఇచ్చిన స్థలాలను పరిశీలించి మాట్లాడారు. గత ప్రభుత్వం ఆవ ప్రాంతం కాపవరం, బూరుగుపూడి గ్రామాల్లో 361 ఎకరాల్లో భూములను ఇళ్లస్థలాల లబ్ధిదారులకు పట్టాలు జారీ చేశారని తెలిపారు.ఇటీవల తూర్పుగోదావరి జిల్లాలో నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధుల పరిచయ కార్యక్రమం సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు ఆవభూములు ఇళ్ళ నిర్మాణానికి పనికిరావని,ముంపుకు గురయ్యేఅవకాశం ఉందని కలెక్టర్ క్షేత్రస్థాయి పరిశీలన చేయాలని కోరారు.ఈ నేపథ్యంలో కలెక్టర్ బుధవారం పరిశీలించారు. ఆమె వెంట ఆర్డీవో ఎ.చైత్ర వర్షిణి, ఇరిగేషన్ డీఈ కె.ఆనంద్‌బాబు, కోరుకొండ తహశీల్దార్ సుమలత, ఇతర అధికారులు ఉన్నారు.

కాచి చల్లార్చిన నీటిని అందించాలి : డీఈవో

నల్లజర్ల,జూలై 24 : ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు కాచి చల్లార్చిన నీటిని అందించాలని డీఈవో వాసుదేవరావు ఉపాధ్యాయులను ఆదేశించారు. ప్రకాశరావుపాలెం హైస్కూల్‌ను బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలని,విద్యార్థులు నోట్స్ రాసే విధంగా ప్రతి సబ్జెక్ట్ టీచర్ బాధ్యత వహించాలన్నారు. వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు.హెచ్ఎం బాధ్యతగా ప్రతి క్లాస్ చెక్ చేసి ఉపాధ్యాయులు బోధించే పాఠాలు విద్యార్థులు అర్థం చేసుకుంటున్నారా లేదా అనేది పర్యవేక్షించాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి అధిక ప్రాధాన్యం

కొవ్వూరు, జూలై 24: కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ ఆంధ్రప్రదేశ్‌కు అధిక ప్రాధాన్యం ఇచ్చిందని బీజేపీ మహిళా మోర్చ రాష్ట్ర కార్యదర్శి తాడిమళ్ళ విజయవాణి అన్నారు. బుధవారం కొవ్వూరు పరిమి రామారాయుడు రత్తమ్మ కళ్యాణ మండపంలో కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి కేటాయింపులపై మహిళామోర్చ ఆధ్వర్యంలో హర్షం వ్యక్తం చేశారు. పట్టణ అధ్యక్షుడు మడిచర్ల రామచంద్రరావు మాట్లాడుతూ కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్ర ప్రయోజనాలకు పెద్దపీట వేసిందన్నారు. ఏపీ పునర్ నిర్మాణానికి ఎన్డీఏ ప్రభుత్వం కట్టుబడి ఉందని రుజువు అయ్యిందన్నారు. విశాఖ స్టీలు ప్లాంట్‌కు రూ.620కోట్లు నిధులు కేటయించి ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరించడం లేదని చెప్పకనే చెప్పిందన్నారు. తాడిమళ్ళ విజయవాణి మాట్లాడుతూ రాజదాని అమరావతికి రూ.15వేలు కోట్లు, జాతీయ ప్రాజెక్టు పోలవరం నిర్మాణానికి అధిక మొత్తంలో నిధుల కేటయింపు, మహిళాభివృద్ధితోపాటు, రాష్ట్రంలోని వెనుకబడిన 8 జిల్లాల అభివృద్ధికి నిధులు కేటయించడం హర్షనీయమన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అనూరాధ, కౌన్సిలర్ పిల్లలమర్రి మురళీకృష్ణ, గంద్రోతు పవన్, బి.మణికంఠ, పి.సుబ్బారెడ్డి, శివకృష్ణ, ఎ. రామకృష్ణ పాల్గొన్నారు.

అన్నవరప్పాడు వెంకన్న ఆదాయం రూ.2,56,619



అన్నవరప్పాడు వెంకన్న ఆలయ హుండీ లెక్కిస్తున్న భక్తులు

పెరవలి, జూలై 24: అన్నవరప్పాడులో ఉన్న వెంకటేశ్వరస్వామి వారి ఆలయ హుండీ లెక్కింపు నిర్వహించారు. 35 రోజులకు 2,56,619 రూపాయలు వచ్చిందని అదేవిధంగా అన్నదాన హుండీ ద్వారా 6,580రూపాయలు ఆదాయం సమకూరిందని ఆలయ ఈవో ఎం.రాధాకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో తాడిపర్రు గ్రూపు దేవాలయాల కార్యనిర్వహణాధికారి ఎంవీ రామ య్య, గ్రామస్థులు, భక్తులు పాల్గొన్నారు.

మూఢనమ్మకాలను పారద్రోలిన జాషువా

కొవ్వూరు, జూలై 24 : రచనలతో సమాజంలోని మూఢాచారాలపై తిరగబడిన వ్యక్తి గుర్రం జాషువా అని టీడీపీ క్లస్టర్ ఇన్ చార్జి పెనుమాక జయరాజు అన్నారు. కొవ్వూరు ఎల్ఐసీ సెంటర్‌లో బుధవారం ఆధునిక తెలుగు కవులలో స్థానం పొందిన కవి గుర్రం జాషువా 51వ వర్ధంతిని నిర్వహించారు. జాషువా విగ్రహానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. పెనుమాక జయరాజు మాట్లాడుతూ గబ్బిళం, పిరదౌసి, రచనలు ప్రాముఖ్యత పొందాయన్నారు. కార్యక్రమంలో కె. పాల్ సుందరం, డి. వెంకటేశ్వరరావు, సిహెచ్ భాస్కరరావు, యేసురత్నం, కె. ఆనందరాజు తదితరులు పాల్గొన్నారు.

'అంగన్‌వాడీలకు కనీస వేతనాలు ఇవ్వాలి'



మంత్రి గుమ్మడి సంధ్యారాణికి వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు

కొవ్వూరు, జూలై 24: అంగన్వాడీలకు కనీస వేతనాలు అమలుచేయాలని స్త్రీ శిశు సంక్షేమశాఖా మంత్రి గుమ్మడి సంధ్యారాణికి వినతిపత్రం అందజేశారు. బుధవారం వెలగపూడి సచివాలయంలో ప్రగతిశీల అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్, ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో మంత్రి సంధ్యారాణిని కలిసి సమస్యలు విన్నవించారు. అంగన్వాడీలకు సమ్మెకాలంలో ఇచ్చిన హామీలను కొత్త ప్రభుత్వం అమలుపర్చాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.ఆర్.జ్యోతి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు భారతి, ఈమని మల్లిక, దుర్గ, ఐఎఫ్‌టీయూ నాయకులు రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు రెయిన్ కోట్లు పంపిణీ



నిడదవోలు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు రెయిన్‌కోట్లు అందజేత

నిడదవోలు, జూలై 24: లయన్స్‌క్లబ్ మున్సిపల్ పాఠశాల చిన్నారులకు వర్షాకాలంలో వినియోగించేలా రెయిన్‌కోట్లు అందించడం ఎంతో అభినందనీయమని సీపీఎం నాయకులు జువ్వల రాంబాబు అన్నారు. బుధవారం నిడదవోలు పట్టణంలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో రంగా వెంకటేశ్వరరావు ఆర్థిక సహకారంతో చర్చిపేటలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మున్సిపల్ పాఠశాల విద్యార్థులకు రెయిన్‌కోట్స్ అందజేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు జేష్ట వెంకటేశ్వరరావు మాట్లాడుతూ లయన్స్‌క్లబ్ విద్యా వైద్యరంగాలకు విశేష సేవలు అందిస్తుందన్నారు. బండి రామ్‌గోపాల్, బి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

'పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి'



దుద్దుకూరులో మొక్కలు నాటుతున్న సర్పంచ్ బొంతా నాగమణి, టీడీపీ నాయకులు

దేవరపల్లి, జూలై 24: పర్యావరణ పరిరక్షణకు ప్రతీఒక్కరు మొక్కలు నాటాలని గ్రామసర్పంచ్ బొంతా నాగమణి, టీడీపీనాయకులు ముళ్ళపూడి దొరాజీ చౌదరి, సొసైటీ మాజీ అధ్యక్షుడు కాండ్రు రామకృష్ణ అన్నారు. దేవరపల్లి మండలం దుద్దుకూరులో బుధవారం చెరువుగట్లపై మొక్కలు నాటే కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణంను పరిరక్షించుకోవాలంటే విధిగా చెరువుగట్లపై, ఇంటి పెరట్లోనూ, బహిరంగ ప్రదేశాల్లో మొక్కలు నాటాలన్నారు. ఎన్ఆర్‌జీఎస్ ద్వారా సరఫరా చేసినా 250మొక్కలను గ్రామంలో నాటినట్లు తెలిపారు. నిమ్మగడ్డ ప్రసాద్, ముళ్లపూడి శ్రీను, కొండేపాటి అశోక్, నున్నా శివరామకృష్ణ, కొయ్యల మూడి తాతారావు, యలమాటి ప్రసాద్, ముళ్ళపూడి సత్యనారాయణ, కరుటూరి శ్రీరామమూర్తి, ఆళ్ళ భుజంగరావు, పంచాయతీ కార్యదర్శి రామచంద్రరావు పాల్గొన్నారు.

స్లాబ్ కూలి మహిళకు గాయాలు

నిడదవోలు, జూలై 24: నిడదవోలు పట్టణంలోని లింగంపల్లిలో స్లాబ్ కూలి బుధవారం సాయంత్రం మహిళకు గాయాలు అయ్యాయి. కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలకు స్లాబ్ నానడంతో పాక్షికంగా కూలింది. దీంతో ఆ ఇంట్లో నివాసముంటున్న మహి ళకు గాయాలు కావడంతో స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తర లించారు. మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, మున్సిపల్ కమీషనర్ రామ్‌భూపాల్‌రెడ్డి, వైసీపీ నాయకులు తదితర్లు పరామర్శించారు.



ప్రభుత్వ ఆసుపత్రిలో గాయాలపాలైన మహిళను పరామర్శిస్తున్న మున్సిపల్ చైర్మన్, అధికారులు

28న ఉచిత శెట్టిబలిజ వివాహ పరిచయవేదిక

రాజమహేంద్రవరం సిటీ, జూలై 24: రాజమహేంద్రవరం గేదెల నూకరాజు కల్యాణ మండపంలో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి శెట్టిబలిజ సంఘీయుల ఉచిత వివాహ పరిచయ వేదిక నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర శెట్టి బలిజ సంఘం ప్రధాన కార్యదర్శి సానబోయిన రామారావు తెలిపారు. రాజమహేంద్రవరం తిలక్‌రోడ్డులోని సంఘ కార్యాలయంలో మాట్లాడారు. సంఘీయులంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు. తల్లిదండ్రులు వధూవరుల కార్డు సైజ్ ఫొటోలు , బయోడేటాలతో హాజరుకావాలని సూచించారు. వివరాలకు 92478 64443, ఆర్గనైజింగ్‌కమిటీ మట్టపర్తి సత్యనారాయణ 9398925726లో సంప్రదించాలన్నారు.

ఎస్సీ వర్గీకరణ అంశాన్ని కేంద్రం దృష్టికి తీసుకెళ్లాలి

● రాష్ట్ర కార్యదర్శి డాన్ సూరి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కొవ్వూరు, జూలై 24 : ఎస్సీ వర్గీకరణ అంశాన్ని కేంద్రం దృష్టికి తీసుకువెళ్లి ఎన్నికల హమీని నిటబెట్టుకోవాలని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబును ఎంఆర్‌పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. కొవ్వూరు ప్రెస్‌క్లబ్‌లో బుధవారం పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. రాష్ట్ర కార్యదర్శి డాన్ సూరి మాట్లాడుతూ మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా గ్రామస్థాయి నుంచి నూతన కమిటీలు వేస్తున్నామన్నారు. ప్రతిమాదిగ పల్లెలో ఎంఆర్‌పీఎస్ జెండా ఆవిష్కరిస్తామన్నారు. వర్గీకరణ అఖరిదశకు చేరుకుందని, ఎస్సీ వర్గీకరణ పూర్తయ్యే వరకు జాతి పెద్దలు, యువకులు, మేథావులు సహకరించాలన్నారు. జిల్లా అధ్యక్షుడు గెడ్డం వినోద్ మాట్లాడుతూ జిల్లా విస్తృతస్థాయి సమావేశం బుధవారం కొవ్వూరులో చేపట్టారు. సామాజిక ఉద్యమాల పితామహుడు 30 ఏళ్లుగా వర్గీకరణ కోసం సుదీర్ఘ పోరాటం చేస్తున్నారు. దానిలో భాగంగా 2014లో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉండగా జస్టీస్ రామచంద్రరావు కమీషన్ సూచనల మేరకు ఎన్నడూలేని విదంగా 24వేల మంది మాదిగ యువత ఉద్యోగాలు పొందార న్నారు. అనంతరం మరలా నిలుపుదల చేయడంతో పార్లమెంటులో వర్గీకరణ అంశంపై చర్చించే విధంగా మంద కృష్ణ మాదిగ జాతీయస్థాయిలో పోరాటం చేశారన్నారు. సుప్రీంకోర్టులో వర్గీకరణపై తీర్పు వచ్చిన తరువాత మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ నియామకాల భర్తీ చేపట్టాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అమరావతి నిర్మాణానికి కేంద్ర బడ్జెట్‌లో కేటాయింపులు చేయడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వర్గీకరణ అంశాన్ని కేంద్ర పెద్దల దృష్టికి తీసుకునివెళ్లి ఎన్నికల వాగ్దానాన్ని నిలబెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ కొక్కిరిపాటి వెంకటేష్, మనెల్లి నాని, గాలింకి రాము, పెదపూడి ఎల్లారావు, నిండికొండ అర్జునరావు పాల్గొన్నారు.



ప్లే కార్డులతో అభినందనలు తెలుపుతున్న కొవ్వూరు రైల్వే పరిరక్షణ సమితి సభ్యులు

మంత్రి పురందేశ్వరికి అభినందన

కొవ్వూరు, జూలై 24 : కొవ్వూరు రైల్వేస్టేషన్‌లో కోవిడ్ కారణంగా నిలుపుదల చేసిన రైల్వేహాల్ట్‌లను పునరుద్ధరించాలని రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి కేంద్ర రైల్వే మంత్రిని కలిసి విన్నవించడం అభినందనీయమని కొవ్వూరు రైల్వే పరిరక్షణ సమితి సభ్యులు కొనియాడారు. బుధవారం కొవ్వూరు రైల్వేస్టేషన్ సెంటర్‌లో పరిరక్షణ సమితి సభ్యుల సమావేశం నిర్వహించి భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. కేంద్ర రైల్వే మంత్రిని కలిసి కొవ్వూరు స్టేషన్‌లో రైళ్ల హాల్ట్‌ల గురించి ప్రస్తావించడంపై ఎంపీ పురందేశ్వరికి అభినందన పూర్వక దన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పరిరక్షణ సమితి సభ్యులు పాల్గొన్నారు.

గ్రంథాలయ పితామహుడు వెంకటరమణయ్య

ఉండ్రాజవరం, జూన్24: ఉండ్రాజవరం శాఖాగ్రంథాలయంలో బుధవారం గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య 134వ జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఆయన గ్రంథాలయాలకు చేసిన సేవలను పలువురు కొనియాడారు. కార్యక్రమంలో లైబ్రరీ కమిటీ సభ్యుడు ఆకెళ్ల శ్రీనివాసరావు, గ్రంథపాలకుడు జి. కృష్ణారావు, స్థానికులు పి.సత్యనారాయణమూర్తి, టి.రాజేంద్రప్రసాద్, ఆర్ సుబ్బారావు, పీవీడీ ప్రసాద్, టి.సతీష్ పాల్గొన్నారు.



అయ్యంకి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

వెంకటరమణయ్యకు ఘన నివాళి

పెరవలి, జూలై24 : గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకటరమణ జయంతి సందర్భంగా ముక్కామల, పెరవలి, తీపర్రు గ్రంథాలయాల్లో కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పెరవలిలో జరిగిన కార్యక్రమంలో ఏడిద సత్యనారాయణ, దాసరి రామకృష్ణ, కె. సత్యనారాయణ, గ్రంధ పాలకుడు కె. వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ముక్కామలలోజరిగిన కార్యక్రమంలో గ్రంథాలయఅధికారి ఎం.వెంకటేశ్వర్లు, కరుటూరి విశ్వనాధం, అక్కరావు, రామకృష్ణ, బాబ్జి పాల్గొన్నారు.

పంటల నష్ట నివారణ చర్యలు చేపట్టాలి

● ఉద్యాన శాఖ అధికారిణి భవిత



నల్లజర్లలో పసుపు రంగువచ్చిన బొప్పాయి పంటను పరిశీలిస్తున్న ఉద్యాన శాఖ మండల అధికారిణి భవిత

నల్లజర్ల, జూలై 24: అధిక వర్షాల కారణంగా మండలంలోని ఉద్యాన వన పంటలపై నష్ట నివారణ చర్యలు చేపట్టాలని ఉద్యాన శాఖ అధికారిణి భవిత అన్నారు. బుధవారం నల్లజర్ల మండలం తెలికిచర్ల,పోడవరం, ప్రకాశరావుపాలెం, నల్లజర్ల గ్రామాల్లో అధిక వర్షలకు దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బొప్పాయి పంట పసుపు రంగులోకి మారడం, కాండం కుళ్లు వంటి లక్షణాలు ఉంటే రెడోమిల్ 2 గ్రాములు ఒక లీటర్ నీటికి వేసి పిచికారీ చేయాలన్నారు. కురగాయల పంటలకు మూడు 19, 13 సున్న 45, యూరియా వంటి పోషకాలను పిచికారీ చేయాలన్నారు. అరటి పంట ఎక్కువరోజులు నీటి ముంపునకు గురైతే వేరే వ్యవస్థ దెబ్బతింటుందని నీటిని బయటకు పంపి ఒక్కో మొక్కకు 100 గ్రాముల యూరియా, 80 గ్రాము పోటాషియం వేయాలన్నారు. లేత ఆయిల్ పాం మొక్కలు మువ్వ నీట మునిగితే బావిస్టన్ 3 గ్రాములు లీటరు నీటిలో కలిపి మువ్వలో పోసి మొక్కంత తడిచే విధంగా పిచికారీ చేయాలన్నారు.

నిలకడగా వరద

పెరవలి, జూలై 24 : గోదావరి వరద ఎగువ భాగంలో తగ్గుతున్నట్టు వారలు వచ్చినప్పటికీ దిగువ భాగంలో మాత్రం అదేవిధంగా నిలబడి ఉంది. పల్లపు ప్రాంతాలు జలమయం కావడంతో పాటు గోదావరి ఏటిగట్టును వరద నీరు తాకింది. దీంతో అరటి, కొబ్బరి, కూరగాయలు, పూల తోటల్లో వరద నీరు చేరింది.



తీపర్రు వద్ద ఏటిగట్టును తాకిన వరదనీరు

సప్లై కంపెనీ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

తాళ్ళపూడి, జూలై 24 : సౌండ్, లైటింగ్, సప్లై కంపెనీలను స్మాల్ స్కేల్ ఇండస్ట్రీలుగా గుర్తించాలని ప్రభుత్వాన్ని కోరామని తూర్పుగోదావరి జిల్లా లైటింగ్, సౌండ్, సప్లై కంపెనీ అసోసిమేషన్ సభ్యులు తెలిపారు. తాళ్ళపూడి మండలస్థాయిలో నూతనంగా ఏర్పడ్డ లైటింగ్, సౌండ్, సప్లై కంపెనీ అసోసియేషన్ ప్రమాణ స్వీకార కార్యక్రమం బుధవారం స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిదులుగా తాళ్ళపూడి తహసీల్ధార్ శ్రీనివాసరావు, ఎలక్ట్రికల్ ఏఈ సిహెచ్ వెంకట్రావులు హజరయ్యారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఏర్పాటు చేసుకున్న యూనియన్ సంఘ సభ్యుల సంక్షేమంతో పాటు సంఘ అభివృద్ధికి వినియోగ పడాలని తెలిపారు. అనంతరం ఏఈ వెంకట్రావు మాట్లాడుతూ సౌండ్ సిస్టం, లైటింగ్ కార్యక్రమాలు ఏర్పాటు చేసే క్రమంలో తగు జాగ్రత్తలు వహించాలని టెంట్‌లు వేసే సందర్బంలో కరెంటు వైర్లను చూసుకోవాలని తమ వద్ద పనిచేసే పనివారికి పూర్తిగా ట్రైనింగ్ ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సౌండ్, లైటింగ్, సప్లై కంపెనీ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు ఎలుబోలు రాజు, కొండే వెంకటరమణ, డివి, వీరబ్రహ్మం, చెన్నా రామకృష్ణ, పెంటాశ్రీను, కొండ్రు రమణ, సభ్యులు పాల్గొన్నారు.



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గం

నరసాపురం ఎంపీడీవో మృతికి సంతాపం



నరసాపురం ఎంపీడీవోకు నివాళులు అర్పిస్తున్న పెరవలి ఎంపీడీవో, సిబ్బంది

పెరవలి, జూలై 24 : నరసాపురం ఎంపీడీవో వెంకటరమణారావు మృతికి పెరవలి ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది శ్రద్ధాంజలి ఘటించారు. మానసిక ఒత్తిడికిగురై బలవన్మరణం పొందిన ఎంపీడీవో ఆత్మకు శాంతి కలగాలని ఈ సందర్భంగా రెండు నిమిషాలు మౌనం పాటించి పుష్పగుచ్చాలు ఉంచారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో హిమమహేశ్వరి, కార్యాలయ సీఈవో రమేష్, సీనియర్ అసిస్టెంట్ వేణుగోపాలరావు, వెంకట వేణు, సాయి శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: ఉండ్రాజవరం మండల పరిషత్ కార్యాలయంలో నరసాపురం ఎంపీడీవో వెంకటరమణ మృతికి కార్యాలయం సిబ్బంది బుధవారం సంతాపం వ్యక్తం చేశారు. ఎంపీడీవో కె.నరేంద్రరెడ్డి ఆధ్వర్యంలో రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో నరేంద్రరెడ్డి మాట్లాడుతూ వెంకటరమణ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

ఎంపీడీవో వెంకటరమణరావు మృతికి సంతాపం



ఎంపీడీవో మృతికి సంతాపం తెలుపుతున్న చాగల్లు ఎంపీడీవో బుజ్జి

చాగల్లు, జూలై 24: నరసాపురం ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తూ అకాల మరణం చెందిన వెంకటరమణరావు మృతికి చాగల్లు మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది మౌనం పాటించి సంతాపం వ్యక్తం చేశారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో ఎన్.బుజ్జి ఆధ్వర్యంలో కార్యాలయ సిబ్బంది మౌనం పాటించి కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు. ఆయన మరణానికి కారకులైన వారిపై ప్రభుత్వం కఠినచర్యలు తీసుకోవాలని కోరారు.

వైద్యం కోసం సాయం అందజేత



జోసఫ్‌కి నగదు అందిస్తున్న టీవీ రామారావు

తాళ్ళపూడి, జూలై 24: తాళ్లపూడి మండలం ప్రక్కిలంక గ్రామంలో బ్లడ్ కేన్సర్ పెషెంటు దేవరపల్లి జోసెఫ్‌కు వైద్యంకోసం కొవ్వూరు నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి టీవీ రామారావు బుధవారం సాయం అందజేశారు. టీవీ రామారావు మాట్లాడుతూ ప్రక్కి లంక గ్రామంలోని దేవరపల్లి రాంబాబు కుమారుడు దేవరపల్లి జోసెఫ్ బ్లడ్ కేన్సర్‌తో బాధపడుతున్నాడని బాబు తండ్రి రోజుకూలీ అని అతని సంపాదన మందులకు సైతం సరిపోక ఇబ్బందులు పడుతున్నాడని జనసేన గ్రామాధ్యక్షుడు సంగిడి రాము తెలుపగా వెంటనే స్పందించి 10వేల రూపాయలు అందించానని ఈనెల 30న బాబుకు ఆపరేషన్ జరుగుతుందని ఆ సమయంలో ఒక లక్షరూపాయలు సేకరించి అతనికి అందేలా చర్యలు తీసు కుంటానని తెలిపారు. అంతేకాక తమ నాయకుడు జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌కు తెలియజేసి ప్రభుత్వం నుంచి తగు సహాయం అందేలా చూస్తానని తెలిపారు. కార్యక్రమంలో బుద్దాల గాంధీ, చెవ్వూరి రాము, పూలపల్లి బాలకృష్ణ, గ్రామాల అధ్యక్షులు, కార్యకర్తలు, జనసైనికులు పాల్గొన్నారు

వినాయక ఆలయ కమిటీ అధ్యక్షుడిగా రామకృష్ణ

కొవ్వూరు, జూలై 24 : కొవ్వూరు మెరకవీధి వినాయకుని ఆలయం నూతన కమిటీ అధ్యక్షుడిగా డేగల రామకృష్ణ నియమితులయ్యారు. బుధవారం నూతన కమిటీ సభ్యులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ కార్యదర్శిగా నండూరి దుర్గాప్రసాద్, జాయింట్ సెక్రటరి డేగల రామ్‌కుమార్, కోశాధికారిగా కసిరెడ్డి శ్రీనివాస్, సభ్యులుగా బహదూర్ మహ్మద్, వంగా సురేష్, చిలపర్తి నాగేశ్వరరావు, తిరుమళ్ళ సత్తిబాబు, గంగ శివ, పట్నాల వీవీ శ్రీనివాస్‌లను ఎన్నుకున్నారు.



కొవ్వూరు మెరకవీధి వినాయకుడి ఆలయ నూతన కమిటీ

కేంద్ర బడ్జెట్ సంతోషాన్ని కలిగించింది

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు దత్తు

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 24 : కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి వరాలు కురిపించడం సంతోషాన్ని కలిగించిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు అన్నారు. రాజమహేంద్రవరం బీజేపీ కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. రాజధాని అమరావతి నిర్మాణానికి రూ.15 వేల కోట్లు ప్రత్యేక ఆర్థికసాయం ప్రకటించడం గొప్ప విషయమని అన్నారు. పోలవరం ప్రాజెక్టును కేంద్రమే నిర్మిస్తుందని చెప్పారన్నారు. ప్రధాని మోదీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ రాష్ట్ర అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిసారించినందుకు దన్యవాదాలు తెలియజేస్తున్నామని పేర్కొన్నారు. ఈనెల 26న కార్గిల్ దివస్ సందర్భంగా భారతీయ జనతా యువమోర్చా ఆధ్వర్యంలో అమరవీరులకు నివాళులర్పిస్తూ లాలాచెరువు సెంటర్లో కాగడాల ప్రదర్శన చేపట్టడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రేలంగి శ్రీదేవి, నాయకులు అడబాల రామకృష్ణారావు, కురగంటి సతీష్, ఎనుముల రంగబాబు, వీరా వీరాంజనేయులు, కాలెపు సాయిరాం, కందికొండ రమేష్ తదితరులు పాలొన్నారు.

మహిళా చట్టాలపై అవగాహన ఉండాలి

● డీఎల్ఎస్ఏ కార్యదర్శి ప్రకాశ్

రాజమహేంద్రవరం, జూలై 24(ఆంధ్రజ్యోతి): మహిళా చట్టాలపై అందరికీ అవగాహన ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.ప్రకాశ్ బాబు పేర్కొన్నారు. స్వాతి మహిళా సంఘం, నారీ సాక్ష్యం సంయుక్త ఆధ్వర్యంలో డీఎల్ఎస్ఏ సహకారంతో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. స్త్రీలు వారి హక్కులను ఉపయోగించుకొని అభివృద్ధి, అన్ని రంగాల్లోనూ అభ్యున్నతి సాధించాలన్నారు. ఉచిత న్యాయ సహాయం కోసం డీఎల్ఎస్ఏని సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ ఎం.లక్ష్మీ సూర్యప్రభ, దిశ పోలీస్ స్టేషన్ డీఎస్పీ ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

సెంట్రల్ జైలును సందర్శించిన ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు

రాజమహేంద్రవరం, జూలై 24(ఆంధ్రజ్యోతి): సోషల్ వర్క్, రాజనీతి శాస్త్ర విభాగాల క్షేత్ర పర్యటనలో భాగంగా ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు ఆయా విభాగాల అధ్యాపకులు సయ్యద్ ఫర్హా, సీతా మహాలక్ష్మీ, రాణి ఆధ్వర్యంలో బుధవారం సెంట్రల్ జైలును సందర్శించారు. జైలులోని అంశాల గురించి సూపరింటెండెంట్ రాహుల్, డిప్యూటీ సూపరింటెండెంట్ రవికుమార్ విద్యార్థులకు వివరించారు.

సర్ ఆర్థర్ కాటన్‌కు నివాళి

ఉండ్రాజవరం, జూలై 24: మండలంలోని పసలపూడి గ్రామపరిధిలో గల గొడిచెర్ల లాకు వద్ద సర్‌ఆర్థర్ కాటన్ వర్ధంతిని బుధవారం ఇరిగేషన్ సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లా సూపరింటెండెంట్ ఎం.విజయకుమార్ సర్‌ఆర్థర్ కాటన్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. లస్కర్లు షేక్ బాషా, కంటిపూడి సుబ్బారావు, రైతులు పాల్గొన్నారు. కాల్ధరి, ఉండ్రాజవరం తదితర గ్రామాల్లో సర్‌ఆర్థర్ కాటన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

హాస్టళ్లలో సమస్యలు పరిష్కరించాలని వినతి

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 24 : జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టళ్లలో విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని పీడీఎస్‌యూ జిల్లా కార్యవర్గం డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.కిరణ్‌కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.భానుప్రసాద్ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం ఆర్డీవో చైత్ర వర్షిణికి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా హైస్కూల్ విద్యార్థులకు నెలకు రూ.3 వేలు, కాలేజీ హాస్టల్ విద్యార్థులకు నెలకు రూ.4 వేలు చొప్పున మెస్ ఛార్జీలు, కాస్మొటిక్ ఛార్జీలు పెంచాలని కోరారు. మెను కచ్చితంగా అమలు చేయాలని, అధికారులు పర్యవేక్షించాలన్నారు.కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు దినేష్‌కుమార్, మధు, రోహిత్, సతీష్, శ్రీను, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్డీవో చైత్ర వర్షిణికి వినతిపత్రం అందజేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

బాధితులకు సాయం అందజేత



బాధితులకు ఆర్థిక సాయం అందజేస్తున్న జనసైనికులు

పెరవలి, జూలై24: కాపవరంలో పవన్ కల్యాణ్ అభిమాని పువ్వల సధాశివ గోపి తన కుమార్తె జాబిలమ్మ పుట్టిన రోజు సందర్భంగా ఇటీవ ల వర్షాలకు నష్టపోయిన వారికి కొంత మందికి నిత్యావసర వస్తువులు, ఆర్థిక సాయం అందజేశారు. నిడదవోలు మండలం రావిమెట్ల, తిమ్మరాజుపాలెం గ్రామాల పరిధిలో ఈ సాయం అందించారు. అదేవిధంగా మృతి చెందిన ఒక కుటుంబానికి కూడా సాయం అందించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు రంగా రమేష్, సాధా వెంకటేష్, కోలా సీతయ్య, రంకిరెడ్డి ప్రసాద్, వెంకట్, గణపతి పాల్గొన్నారు.

గుర్రం జాషువాకు ఘన నివాళి

రాజమహేంద్రవరం సిటీ, జూలై 24 : కవియుగ చక్రవర్తి గుర్రం జాషువా అని జిల్లా ఎస్సీఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు కోరుకొండ చిరంజీవి అన్నారు. జాషువా 53వ వర్ధంతిని పురస్కరించుకుని రాజమహేంద్రవరం రత్నం ప్రింటర్స్ కార్యాలయంలో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రత్నం ప్రింటర్స్ అధినేత ధారా యేసురత్నం, ఎస్సీఎస్టీ నాయకులు తాళ్ళూరి బాబు రాజేంద్రప్రసాద్, ఎంపీడీ కృపావరం, మోతా నాగలక్ష్మి, ఉసురుమర్తి రామారావు, చాపల రాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

నల్లజర్ల, జూలై 24: నల్లజర్లలోని 33కేవీ సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా శుక్రవారం మండలంలోని అన్ని గ్రామాల్లో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఈఈ వీరభద్రరావు ఒక ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా వ్యవసాయ పంపుసెట్లకు ఉదయం 3 నుంచి 9గంటల వరకు, మధ్యాహ్నం 2నుంచి 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఇస్తారని పేర్కొన్నారు.